మనం
హైదరాబాద్
రంగారెడ్డి | మేడ్చల్
మంగళవారం | 5 | ఆగస్టు | 2025 పేజీలు: 11



-రహదారుల్లో వర్షపు నీరు
-కిమీ మేరకు ట్రాఫిక్ జామ్
-కుండపోత వర్షం.. 15.1 సెంమీ
-మోటార్లతో వర్షపు నీటి తొలగింపు
-హైడ్రా ముమ్మర సహాయక చర్యలు
-విద్యుత్ సరఫరాలో అంతరాయం
-పొంగిపొర్లిన డ్రైనేజీతో దుర్గంధం
-జలమండలి బృందాలు అప్రమత్తం
-లోతట్టు ప్రాంతాలు జలమయం



# అష్ట దిగ్బంధం





**సిటీబ్యూరో, మనం న్యూస్:**


కుండపోత వర్షంతో గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు శివార్లు ట్రాఫిక్ జామ్‌తో అష్టదిగ్భందంలో చిక్కుకున్నాయి. ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షం రికార్డు స్థాయిలో అత్యధికంగా 15.1 సెంమీగా నమోదయ్యింది. ఇక చార్మినార్, మధీన, ఖైరతాబాద్, లక్డీకాపూల్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఫిలింనగర్, పంజాగుట్ట, అమీర్‌పేట్, మధురానగర్, బోరబండ, యూసుఫ్‌గూడ, ఎర్రగడ్డ, సనత్‌నగర్, మెహదీపట్నం,

-మిగతా 2లో

## ఓన్లీ డిజిటల్

-నో మ్యాన్‌వల్ పేమెంట్స్
-బల్దియాలో ఏఐ విధానం



సిటీబ్యూరో, మనం న్యూస్: ప్రజలు జరిపే చెల్లింపుల ప్రక్రియలో పారదర్శకతను పెంచడంతో పాటు సరళీకృతం చేయాలని బల్దియా నిర్ణయించింది. ఇందులో భాగంగానే డిజిటల్ పేమెంట్స్ పెంచాలని యోచిస్తున్నది. అందుబాటులోకి వస్తున్న సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకుంటూ చెల్లింపులు పక్కదారి పట్టకుండా నేరుగా బల్దియా ఖాతాలోకి చేరాలనేది లక్ష్యం. రానున్న రోజుల్లో మ్యానువల్‌గా కాకుండా పూర్తిగా చెల్లింపులు డిజిటల్ విధానంలోనే స్వీకరించేందుకు కసరత్తు చేస్తున్నారు. ఇందులో భాగంగానే గూగుల్ టీమ్‌తో

-మిగతా 2లో

## స్థలాలను రక్షిస్తాం

-హైడ్రా బాస్ ఏవీ రంగనాథ్



3

## జాప్యం చేయరాదు

-మేడ్చల్ జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి



3

## సత్వరం స్పందించాలి

-హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన



3

## త్వరగా పరిష్కరించాలి


-బల్దియా అదనపు కమిషనర్ రఘుప్రసాద్



3

## ప్రాధాన్యత ఇవ్వాలి

-వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



3

## అధికారులు స్పందించాలి

-రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సీ.నారాయణరెడ్డి



3



# ఓన్లీ డిజిటల్

## మొదటి పేజీ తరువాయి

బల్దియా బాస్ కర్ణన్ సమావేశమై డిజిటల్ పేమెంట్స్ విషయంలో ఒప్పందం చేసుకున్నట్లు సమాచారం.

ప్రధాన ఆర్థిక వనరులైన భవన నిర్మాణ అనుమతుల రుసుం, అద్దెల వసూళ్లు, ప్రాపర్టీ ట్యాక్స్, ట్రేడ్ లైసెన్సుల చెల్లింపుల్లో పౌరులకు డిజిటల్ విధానం వెసులుబాటుగా ఉంటుంది. మ్యాన్‌వల్ వసూళ్లలో ఇప్పటి వరకు జరిగిన సిబ్బంది చేతివాటంతో బల్దియా ఖజానాకు గండికొట్టిన సందర్భాలను దృష్టిలో పెట్టుకుని పారదర్శక చెల్లింపులకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. ఆస్తిపన్ను, ట్రేడ్ లైసెన్స్ ఛార్జీలు, అద్దెల వసూళ్లు యూపీఐతో జరిపితే వృథా ఖర్చులను తగ్గించుకునేందుకు వీలుంటుందని అధికారులు పేర్కొంటున్నారు. ఇదిలాఉండగా... డిజిటల్ పేమెంట్ విధానం ఇప్పటికే బల్దియాలో 50 శాతం అమలు అవుతున్నట్లు సమాచారం. బల్దియాకు భారీగా ఆదాయం సమకూర్చే ఆస్తిపన్ను సగానికిపైగా ఆన్‌లైన్ విధానంలోనే చెల్లింపులు జరుగుతున్నాయి. ప్రస్తుతం పేటీఎం, గూగుల్ పే, యూపీఐ యాప్, మై జీహెచ్‌ఎంసీ మొబైల్ యాప్, జీహెచ్‌ఎంసీ వెబ్ సైట్ ద్వారా ప్రజలు పన్నులు చెల్లిస్తున్నారు. వీటికి తోడు వాట్సప్ సేవలు అందుబాటులోకి వస్తే ఆన్‌లైన్ కలెక్షన్ మరింత పెరుగుతుందని అధికారులు ఆశాభావంతో ఉన్నారు. ఏదేమైనా దుబారా ఖర్చును తగ్గిస్తూ.. మ్యాన్‌వల్ సేవలు అందించే ఉద్యోగులను ఇతర సేవలకు వినియోగించుకుంటూ... డిజిటల్ పేమెంట్స్‌తో పారదర్శకతతో పాటు ప్రజలకు వెసులుబాటు కల్పించాలనేది బల్దియా లక్ష్యం.

### గూగుల్‌తో ఎంఓయూ...

పౌరసేవల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చేందుకు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ గూగుల్ సంస్థతో చేతులు కలిపింది.ప్రధాన పౌర సమస్యలను పరిష్కరించేందుకు.. పౌర సేవలను మెరుగుపరిచేందుకు జనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్-ఏఐ కంటే అడ్వాన్స్ ఆధారిత పైలట్ ప్రాజెక్ట్‌ను త్వరలో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. హైదరాబాద్‌ను జనరేటివ్ ఏఐ నగరంగా తీర్చిదిద్దాలనే సంకల్పానికి ఈ ప్రాజెక్ట్‌తో ఒక ముందడుగు పడింది. సోమవారం సాయంత్రం ఈ ప్రాజెక్ట్ అమలుపై చర్చించేందుకు పురపాలక శాఖ కార్యదర్శి ఇలంబర్తి, బల్దియా బాస్ ఆర్‌వీ కర్ణన్ తదితరులతో గూగుల్ క్లౌడ్ ప్లాట్ ఫాం ద్వారా వర్చువల్ సమావేశం జరిగింది. జనరేటివ్ ఏఐ పైలట్ ప్రాజెక్ట్ భవిష్యత్ టెక్ ఆధారిత పరిష్కారాలను అన్వేషించి, స్మార్ట్, పౌర సమస్యలపై సత్వరమే స్పందించే నగర పాలన నిర్మాణంపై దృష్టి సారించనుంది. ఇందులో భాగంగానే జెనరేటివ్ ఏఐ ఆధారితంగా దృష్టి సారించిన కీలక రంగాలు... ప్రభుత్వ, పౌర సేవలు, వెబ్‌సైట్ల కోసం జనరేటివ్ ఏఐ సెర్చ్ బార్, పౌరుల విచారణల వర్గీకరణ కోసం ఏఐ సిస్టమ్, స్మార్ట్ పార్కింగ్ నిర్వహణ, సమర్థ ఘన వ్యర్థ నిర్వహణ, పౌర దరఖాస్తుల కోసం ఆటోమేటెడ్ ఫారమ్ ఫిల్లింగ్, గూగుల్ మ్యాప్స్ ద్వారా పబ్లిక్ బస్సుల రియల్-టైమ్ ట్రాకింగ్, రోడ్ సేఫ్టీ, ట్రాఫిక్ మోడల్స్, హెల్త్ రికార్డులు, హెల్త్ అనలిటిక్స్ ప్లాట్ఫామ్, కీటక జనిత వ్యాధుల నివారణ, సత్వర వైద్య సేవలు, లేక్స్‌లో చెత్త, వ్యర్థాల పారబోత నివారించేందుకు పర్యవేక్షణ... నగర పౌరుల నిత్య జీవన ప్రయాణాన్ని మరింత సులభతరం చేస్తూ జీవన ప్రమాణాలు గణనీయంగా మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తుందని బల్దియా బాస్ కర్ణన్ తెలిపారు




# అష్ట దిగ్బంధం

## మొదటి పేజీ తరువాయి



లంగర్‌హౌస్, కార్వాన్, గోల్కొండ, జియాగూడ, సికింద్రాబాద్, బషీర్‌బాగ్, మాదాపూర్ కూకట్‌పల్లి, హైదర్‌నగర్, వివేకానందనగర్, హిమాయత్‌నగర్, కోఠి, సుల్తాన్ బజార్, కాప్రా, చందానగర్, మూసాపేట, బేగంపేట్, మల్కాజ్‌గిరి, ముషీరాబాద్, మెహదీపట్నం, గోషామహల్, మలక్‌పేట్, సరూర్‌నగర్, వనస్థలిపురం, హయత్‌నగర్, బీఎన్‌రెడ్డి నగర్, ఎల్‌బీనగర్... ఇలా అక్కడ ఇక్కడ అని కాకుండా.. అన్ని ప్రాంతాల్లో వర్షం దంచికొట్టింది. ఫలితంగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఎక్కడ చూసినా రహదారుల్లో వాహనాలు కనిపించాయి. గంటలతరబడి ట్రాఫిక్ జామ్ ఏర్పడంతో నగర జీవనం స్థంభించిపోయింది. గంటపాటు కురిసిన కుంభవృష్టితో రహదారుల్లో వరదనీరు ప్రవహరించింది. వివిధ ప్రాంతాల్లో గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. చెత్త కారణంగా పలు ప్రాంతాల్లో వర్షం నీటికాలువల కవర్లు మూసుకుపోవడంతో వర్షపు నీరు రహదారుల్లోకి చేరిపోయింది. పొంగిపొర్లిన డ్రైనేజీలతో దుర్గంధం వ్యాపించింది. పలు ప్రాంతాల్లో కూలిన చెట్లు, విరిగిపడిన విద్యుత్ స్థంబాలతో సమస్య తీవ్రరూపం దాల్చింది.

గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తూ.. భారీ వర్షం కురవడంతో గ్రేటర్‌లో ప్రజలు తీవ్ర ఇబ్బందుల పాలయ్యారు. ఒక్కసారిగా కురిసిన వర్షానికి రోడ్లు జలమయమవడంతో వాహనదారులు ఇబ్బందులుపడ్డారు. కొన్ని ప్రాంతాల్లో వరద నీటిలో వాహనాలు కొట్టుకుపోయాయి. సోమవారం మధ్యాహ్నం తరువాత నుంచి క్రమంగా అక్కడక్కడా ప్రారంభమైన వర్షం ఓ మోస్తరు నుంచి భారీగా.. అతిభారీగా కురవడం జరిగింది. దాదాపు గంట నుంచి గంటన్నర పాటు భారీ వర్షం కురిసింది. ఈ క్రమంలోనే ఐకియా సెంటర్, ఏఎంబీ, ఇనార్బిట్ మాల్, కొండాపూర్ ప్రాంతాల్లో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. వాహనాలు ఏమాత్రం ముందుకు కాదలలేదు. దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జి నుంచి ఐకియా వరకు ట్రాఫిక్ స్తంభించింది. కొత్తగూడ, గచ్చిబౌలి, రాయదుర్గ్, హైటెక్ సిటీతో పాటు సెక్రటేరియట్ ప్రాంతాల్లో ట్రాఫిక్ నిలిచిపోయింది. అవుటర్‌రింగ్ రోడ్ నుంచి శిల్పా లేఅవుట్, కొండాపూర్ కొత్త బ్రిడ్జి వరకు ట్రాఫిక్ నిలిచిపోయింది. అమీర్‌పేట్, మైత్రివనం, పంజాగుట్ట, గ్రీన్‌పార్క్, బేగంపేట్, బంజారాహిల్స్-12, మాసబ్ ట్యాంక్, మెహిదీపట్నం, నానల్‌నగర్, లక్డీకాపూల్, సచివాలయం, దాదాపు రెండు గంటలకుపైగా ట్రాఫిక్ స్తంభించడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మరోవైపు పలు ప్రాంతాల్లో రోడ్లపై మోకాళ్ల వరకు వరద నీరు నిలిచిపోయింది. ఈ సందర్భంగా హైడ్రా బృందాలు.. బల్దియా బృందాలు.. జలమండలి బృందాలు రంగంలోకి దిగి వర్షం కారణంగా నెలకొన్న సమస్యలను తొలగించేందుకు తీవ్రంగా కృషి చేయడం జరిగింది. వరద నీటిని పోలీసులు, హైడ్రా, జీహెచ్‌ఎంసీ సిబ్బంది మోటార్ల సహాయంతో తొలగించారు. ఎక్కడైనా వరద ముప్పు ఉన్నట్లయితే రౌండ్ క్లాక్ పని చేసే హైడ్రా కంట్రోల్ రూమ్ 9000113667 కి ఫిర్యాదు చేయాలని అధికారులు సూచించారు. భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని వాతావరణశాఖ ప్రజలను సూచించింది. అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని బల్దియా, హైడ్రా, జలమండలి సూచించాయి.

### జలమండలి అప్రమత్తం

భారీ వర్షాల నేపథ్యంలో జలమండలి అప్రమత్తం అయ్యింది. సహాయక బృందాలను రంగంలోకి దింపింది. రానున్న మూడు రోజులు అందరూ సిబ్బంది అందుబాటులో ఉండాలని జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి ఆదేశించారు. వర్షం వల్ల ప్రజలకు ఇబ్బంది లేకుండా అన్ని రకాలుగా ముందస్తు చర్యలు చేపట్టాలని, ఎమర్జెనీ బృందాలు అప్రమత్తంగా ఉండాలని జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి సూచించారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ముంపునకు గురైన ప్రాంతాల్లో మ్యాన్‌హోళ్ల దగ్గర హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని.. డీప్ మ్యాన్‌హోళ్ల దగ్గర సీవరేజీ సూపర్‌వైజర్లు ఉండేలా చర్యలు చేపట్టారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మ్యాన్‌హోల్ మూతలను తెరవకూడదని ఆయన సూచించారు. ఇతర వివరాలకు జలమండలి కస్టమేర్ కేర్ 155313కి కాల్ చేయాలని ఆయన కోరారు.



# స్థలాలను రక్షిస్తాం

**-హైడ్రా బాస్ ఏవీ రంగనాథ్**

రాణిగంజ్, మనం న్యూస్: లే ఔట్‌ను ప్రామాణికంగా తీసుకుని పార్కులు, రహదారులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలను పరిరక్షిస్తామని హైడ్రా బాస్ ఏవీ రంగనాథ్ స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం జరిగిన ప్రజావాణిలో ఆయన పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. రహదారులను ఎక్కడా బ్లాక్ చేయవద్దని.. పార్కుల ఆవశ్యకతను అర్థం చేసుకుని వాటిని చెరబట్టవద్దని విజ్ఞప్తి చేశారు. ఎక్కడ ఆక్రమణ జరిగినా, ఉల్లంఘనలైనా నేరుగా హైడ్రాకు ఫిర్యాదు చేస్తున్నారని.. ఇందులో అధికభాగం పార్కుల కబ్జాలు, రహదారుల ఆక్రమణలు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాల కాజేసే ప్రయత్నాలపై ఫిర్యాదులే అధికంగా ఉన్నాయని తెలిపారు. గూగుల్ మ్యాప్స్, లేఔట్లతో పాటు.. ఎన్‌ఆర్‌ఎస్సీ, సర్వే ఆఫ్ ఇండియా, గ్రామ రికార్డులను ఫిర్యాదుదారుల ముందే ఆన్‌లైన్ చూసి.. పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలను ఆదేశించారు.




అక్కడికక్కడే ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో విచారించాలని అసెట్ ప్రొటెక్షన్ అధికారులకు అప్పగించారు. సమస్య పరిష్కారానికి గడువును కూడా ఫిర్యాదుదారుల ముందే నిర్ణయించారు.



## సత్వరం స్పందించాలి

**-హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన**

క్డీకాపూల్, మనం న్యూస్: ప్రజా సమస్యల అర్జీలపై సత్వరమే స్పందించాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కదిరవన్ పలనితో కలసి కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వివిధ సమస్యలపై ప్రజలు అందజేసిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులు పరిశీలన చేసి పరిష్కరించాలన్నారు. దివ్యాంగులు, వయోవృద్ధుల అర్జీ సమర్పణ సులభతరం చేసేందుకు సీఎం సూచనల మేరకు గత వారం ప్రవేశపెట్టిన వాట్సాప్ ద్వారా వచ్చే అర్జీలకూ సమాన ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి ఈ.వెంకటాచారి, సీపీఓ డాక్టర్ ఎన్.సురేందర్, డీఎంఎంహెచ్ఓ డాక్టర్ వెంకటి, వివిధ శాఖల జిల్లా అధికారులు, అర్జీదారులు తదితరులు పాల్గొన్నారు.

## త్వరగా పరిష్కరించాలి

**-బల్దియా అదనపు కమిషనర్ రఘుప్రసాద్**



ట్యాంక్‌బండ్, మనం న్యూస్: ప్రజల నుంచి అందే ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని బల్దియా అదనపు కమిషనర్ రఘుప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి ఫిర్యాదులు, విజ్ఞాపన పత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ రఘు ప్రసాద్ మాట్లాడుతూ... ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంకు అన్ని విభాగాల అధికారులు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రజల విన్నపాల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహించరాదన్నారు.

## ప్రాధాన్యత ఇవ్వాలి

**ప్రాధాన్యత ఇవ్వాలి**

**-వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**

వికారాబాద్ బ్యూరో, మనం న్యూస్: ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులకు ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ జిల్లా కార్యాలయాల సముదాయంలో జరిగిన ప్రజావాణిలో ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజా ఫిర్యాదులను సంబంధిత అధికారులు పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ... ప్రాధాన్యతా క్రమంలో సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్‌లు లింగ్యా నాయక్, సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ హర్ష్ చౌదరి, వివిధ శాఖల జిల్లా అధికారులు, సెక్షన్ సూపరింటెండెంట్స్ తదితరులు పాల్గొన్నారు.



## అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి

**-బాధ్యతల స్వీకరణ**



కొంగరకలాన్, మనం న్యూస్: రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ)గా కే.చంద్రారెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కొంగరకలాన్‌లోని సమీకృత రంగారెడ్డి జిల్లా కార్యాలయాల సముదాయంలోని తన చాంబర్‌కు చేరుకుని బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ ఏఓ సునీల్ కుమార్ అదనపు కలెక్టర్‌కు స్వాగతం పలికారు. హెచ్‌ఎండీఏ బుద్ధపూర్ణిమ ప్రాజెక్టు ఓఎస్డీగా పనిచేస్తున్న కే.చంద్రారెడ్డిని తాజా బదిలీల్లో రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్‌గా ప్రభుత్వం నియమించింది.

## జాప్యం చేయరాదు

**-మేడ్చల్ జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి**

మేడ్చల్ బ్యూరో, మనం న్యూస్: ప్రజావాణిలో స్వీకరించిన ధరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు అందజేస్తూ జాప్యం లేకుండా సత్వరమే అర్జీలను పరిశీలించి పరిష్కరించాలని మేడ్చల్ జిల్లా కలెక్టరు మిక్కిలినేని మను చౌదరి అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి అదనపు కలెక్టర్లు విజయేందర్‌రెడ్డి, రాధికగుప్తా, డీఆర్‌ఓ హరిప్రియలతో



కలిసి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ, ఎంతో వ్యయ, ప్రయాసలకోర్చుకొని వారి సమస్యలను పరిష్కరిస్తామనే నమ్మకంతో ప్రజలు మన వద్దకు వస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత మనందరిపైన ఉన్నదన్నారు.

## అధికారులు స్పందించాలి

**-రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సీ.నారాయణరెడ్డి**

రంగారెడ్డి బ్యూరో, మనం న్యూస్: ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యతనిస్తూ సత్వరమే పరిష్కరించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సీ.నారాయణరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కే.చంద్రారెడ్డి, డీఆర్‌ఓ సంగీతతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా అధికారులు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సత్వరమే స్పందించి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.



# ఆకాష్ ఆంథే 2025 స్కాలర్‌షిప్ పరీక్షకు దరఖాస్తులు ప్రారంభం

బంజారాహిల్స్,మనంన్యూస్:ఆకాష్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ లిమిటెడ్ (ఏఈఎస్ఎల్) దేశవ్యాప్తంగా ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించడానికి తమ ప్రతిష్ఠాత్మక 'ఆకాష్ నేషనల్ టాలెంట్ హంట్ ఎగ్జామినేషన్' (ఆంథే) 2025ను ప్రకటించింది.ఈ విషయమై సంస్థ సీఈఓ,ఎండీ దీపక్ మెహ్రోత్రా మాట్లాడుతూ గత 16 సంవత్సరాలుగా ఆంథే ఆర్థిక స్థితితో సంబంధం లేకుండా విద్యార్థులు తమ లక్ష్యాలను చేరుకోవడానికి సహాయపడుతోందని తెలిపారు.ఈ సంవత్సరం కొత్తగా 'ఇన్విక్టస్ ఏస్ టెస్ట్'ను కూడా ప్రారంభించామన్నారు.ఇది ప్రతిష్ఠాత్మకమైన ఆకాష్ ఇన్విక్టస్ కోర్సులో ప్రవేశం,స్కాలర్‌షిప్ కోసం నిర్వహిస్తామని పేర్కొన్నారు.2025లో 10 లక్షలకు పైగా విద్యార్థులు ఆంథే పరీక్ష రాశారన్నారు.దీని ద్వారా చాలామంది టాపర్లు తయారయ్యారని ఆయన గుర్తు చేశారు.ఈ ఏడాది నీట్ టాప్ 100లో 22 మంది, జేఈఈ అడ్వాన్స్‌డ్ టాప్ 100లో 10 మంది ఆంథే ద్వారానే తమ ప్రయాణాన్ని ప్రారంభించారని వివరించారు.ఆంథే 2025 పరీక్ష ఆన్లైన్,ఆఫ్లైన్ విధానాల్లో నిర్వహించబడుతుందన్నారు.ఆన్లైన్ పరీక్ష అక్టోబర్ 4 నుంచి 12,2025 వరకు జరుగుతుందన్నారు.విద్యార్థులు తమకు అనుకూలంగా గంట స్లాట్ను ఎంచుకోవచ్చని చెప్పారు.ఆఫ్లైన్ పరీక్ష అక్టోబర్ 5,12 తేదీల్లో 26 రాష్ట్రాలు,కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 415కి పైగా ఆకాష్ సెంటర్లలో జరుగుతుందని ప్రకటించారు.నమోదు ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని,ఆసక్తిగల విద్యార్థులు హెచ్‌టీటీపీఎస్//ఆంథే.ఆకాష్.ఏసి.ఇన్ వెబ్సైట్లో ఆన్లైన్లో లేదా దగ్గర్లోని ఆకాష్ సెంటర్లో నమోదు చేసుకోవచ్చని సూచించారు.పరీక్ష రుసుము రూ.300లని తెలియజేశారు.ముందుగా దరఖాస్తు చేసుకున్న వారికి 50శాతం రాయితీ లభిస్తుందన్నారు.ఆన్లైన్ పరీక్షకు దరఖాస్తు గడువు పరీక్షకు మూడు రోజుల ముందు,ఆఫ్లైన్ పరీక్షకు ఏడు రోజుల ముందు ముగుస్తుందన్నారు.అడ్మిట్ కార్డులు పరీక్షకు ఐదు రోజుల ముందు జారీ చేయబడతాయని వెల్లడించారు.




## పాఠశాల విద్యార్థులకు బూట్ల పంపిణీ



కేపీహెచ్బీ కాలనీ, మనం న్యూస్ : పేద విద్యార్థుల ముఖాల్లో చిరునవ్వులు పూయించే లక్ష్యంతో కూకట్పల్లిలోని స్వచ్ఛ భారత కన్వీనర్ నర్వ పవన్ చొరవతో బూట్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే మాధవరం కాంతారావు ముఖ్య అతిథిగా హాజరై, సుమారు వంద మందికి పైగా విద్యార్థులకు బూట్లు అందజేశారు.చిన్నారి పాదాలకు రక్షణ కవచంలా బూట్లు నిలవాలని ఆకాంక్షిస్తూ, విద్యార్థులందరూ శ్రద్ధగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కాంతారావు ఆకాంక్షించారు. తమకు కొత్త బూట్లు వచ్చిన ఆనందంలో విద్యార్థుల ముఖాలు వెలిగిపోయాయి. ఈ కార్యక్రమానికి నరేన్, తోట రమేష్ సహా పాఠశాల ఉపాధ్యాయులు రవీంద్ర, విఠల్, వినోద్, అంజి రెడ్డి, రేవతి, నాగలక్ష్మి, స్వర్ణ, ప్రేమ్, సూరిబాబు, సాయి గణేష్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ, విద్యార్థుల విద్యా అవసరాలను తీర్చడం మనందరి సామాజిక బాధ్యత అని అన్నారు. ఇటువంటి కార్యక్రమాలు కొనసాగుతాయని ఆయన హామీ ఇచ్చారు.

## జేఎన్టీయూహెచ్ అధ్యాపకుడు సారెడ్డి శివారెడ్డికి డాక్టరేట్

కేపీహెచ్బీ కాలనీ, మనం న్యూస్: కూకట్పల్లి జేఎన్టీయూహెచ్లో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ (సీఎస్ఈ) విభాగంలో కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్గా పనిచేస్తున్న సారెడ్డి శివారెడ్డి ప్రతిష్ఠాత్మక డాక్టరేట్ సాధించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్లో ఆయన పీహెచ్డీని పూర్తిచేశారు. 'మెషిన్ లెర్నింగ్ టెక్నిక్స్ ఉపయోగించి డిఫెక్ట్ ప్రిడిక్షన్ ద్వారా సాఫ్ట్వేర్ విశ్వసనీయతను పెంచడం' అనే అంశంపై డాక్టర్ సురేష్ పబ్బోజు పర్యవేక్షణలో ఆయన తన పరిశోధనను విజయవంతంగా ముగించారు.నల్గొండ జిల్లా, మిర్యాలగూడ మండలం, అన్నారం గ్రామానికి చెందిన శివారెడ్డి, అధ్యాపకుడిగా విధులు నిర్వర్తిస్తూనే కాంట్రాక్ట్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చూస్తున్నారు. పీహెచ్డీ థీసిస్ సమర్పణ, మూల్యాంకనం, ఇంటర్వ్యూ పూర్తిచేయటంతో ఆయన డాక్టరేట్కు అర్హత పొందారు. ఈనెల 19న జరిగే ఉస్మానియా విశ్వవిద్యాలయం 84వ స్నాతకోత్సవంలో రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా ఆయన పట్టా అందుకోనున్నారు.శివారెడ్డికి డాక్టరేట్ లభించడం పట్ల జేఎన్టీయూహెచ్ వీసీ ప్రొ. టి. కిషన్ కుమార్ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు, విభాగ సిబ్బంది హర్షం ప్రకటించారు. కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు, జేఏసీ చైర్మన్ డా. కరుణాకర్ రెడ్డి, కాంట్రాక్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేష్ నాయక్, సభ్యులు, కుటుంబసభ్యులు, మిత్రులు ఆయనకు అభినందనలు తెలిపారు. ఒక సాధారణ గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చి ఉన్నత విద్యావంతుడిగా నిలవడం ఎందరికో ఆదర్శమని పలువురు కొనియాడారు.




## కొత్త ఇంట్లో కొత్త ఆశలు



కేపీహెచ్బీ కాలనీ, మనం న్యూస్ : కూకట్పల్లి హౌసింగ్ బోర్డు (కేపీహెచ్బీ) డివిజన్లో కాంగ్రెస్ నాయకుడు ఎల్. రాజా నూతన గృహప్రవేశ వేడుక సోమవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్పల్లి ఇన్చార్జి బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.రాజా గృహప్రవేశ వేడుకకు విచ్చేసిన బండి రమేష్ను కుటుంబ సభ్యులు, పార్టీ కార్యకర్తలు సాదరంగా ఆహ్వానించారు. నూతన గృహంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన బండి రమేష్, రాజాకు శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. పార్టీ కోసం రాజా చేస్తున్న కృషిని ఆయన ఈ సందర్భంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గొట్టుముక్కల వెంకటేశ్వరరావు, లక్ష్మయ్య, గంధం రాజు, కొప్పిశెట్టి దినేష్, రమేష్, శివ చౌదరి, రమణ తదితరులు పాల్గొన్నారు. పార్టీ శ్రేణులు, స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై రాజాకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందడితో ఆ ప్రాంతంలో పండుగ వాతావరణం నెలకొంది.

## కూకట్పల్లిలో కాంగ్రెస్ నాయకుడి గృహప్రవేశ వేడుక



కేపీహెచ్బీ కాలనీ, మనం న్యూస్ : కూకట్పల్లి నియోజకవర్గంలోని 121వ డివిజన్కు చెందిన కాంగ్రెస్ నాయకుడు సతీష్ నూతన గృహప్రవేశం సోమవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్పల్లి ఇన్చార్జి బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నూతన గృహ ప్రవేశ వేడుకకు విచ్చేసిన బండి రమేష్ను సతీష్ కుటుంబ సభ్యులు సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా బండి రమేష్ సతీష్కి శుభాకాంక్షలు తెలియజేసి, భవిష్యత్తులో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. పార్టీ కోసం సతీష్ చేస్తున్న కృషిని ఆయన అభినందించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గొట్టుముక్కల వెంకటేశ్వరరావు, లక్ష్మయ్య, మేకల రమేష్, శివ చౌదరి, సుదర్శన్, రమణ, బొట్టు రాజు తదితరులు పాల్గొన్నారు. పార్టీ శ్రేణులు, స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కొత్త ఇల్లు కట్టుకున్న సతీష్ను అభినందిస్తూ, అందరూ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

## అన్యాయంగా కేసులు నమోదు చేస్తున్నారు

-మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రా రెడ్డి



ఖైరతాబాద్, మనం న్యూస్: గుడి కూల్చివేతను ప్రశ్నించిన హిందువులపై అన్యాయంగా కేసులు నమోదు చేస్తున్నారని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు,ఖైరతాబాద్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రా రెడ్డి ఆరోపించారు.బంజారాహిల్స్ ఎన్బీటీ నగర్ పెద్దమ్మ గుడి దేవాలయ కూల్చివేత విషయమై హైదరాబాద్ కలెక్టర్ దాసరి హరిచందనను ఆయన సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు.దేవాలయాన్ని పునర్నిర్మించాలన్నారు.అదే విధంగా పోలీసులు అక్రమ కేసులతో భయాందోళనలకు గురి చేస్తున్నారని,హిందువులకు తప్పుడు కేసుల నుంచి రక్షణ కల్పించాలని కోరారు.వెయ్యి గజాల స్థలాన్ని గుడి కోసం కేటాయించి నిర్మాణం చేపడితే తమ వంతు సహకారం అందిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో హైదరాబాద్ సెంట్రల్ జిల్లా బిజెపి అధ్యక్షుడు లంకాల దీపక్ రెడ్డి,నాయకులు శ్రవణ్ యాదవ్,రాఘవ రెడ్డి,దేవాలయ ప్రతినిధులు అమర్ నాథ్ యాదవ్,మహేష్ తదితరులున్నారు.

## బోనాల ఉత్సవాల్లో పిసిసి సభ్యుడు శ్రీనివాస్ గౌడ్



కడ్తాల్, మనం, న్యూస్ : రంగారెడ్డి జిల్లా పాలమాకుల గ్రామంలో గ్రామ దేవతల బోనాల ఉత్సవాలకు రాష్ట్ర పిసిసి సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథులుగా పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. తొట్టెల ఊరేగింపులో అయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవార్లను వేడుకున్నట్లు తెలిపారు.

# జేఎన్టీయూలో పరీక్షా ఫలితాలపై ఆరోపణలు, విచారణకు డిమాండ్



కేపీహెచ్బీ కాలనీ, మనం న్యూస్ : జవహర్లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జేఎన్టీయూ)లో పరీక్షా విభాగంపై వస్తున్న ఆరోపణలపై పూర్తిస్థాయి విచారణ జరపాలని స్టూడెంట్స్ ప్రొటెక్షన్ ఫోరం డిమాండ్ చేసింది. సోమవారం ఈ మేరకు ఫోరం నాయకులు ఉపకులపతి ప్రొఫెసర్ కిషన్ కుమార్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. విశ్వవిద్యాలయ పరీక్షా విభాగాన్ని పటిష్టం చేయాలని, విద్యార్థులకు నమ్మకం పోకుండా చర్యలు తీసుకోవాలని ఫోరం కోరింది. నాన్-కన్వెన్షనల్ సోర్స్ ఆఫ్ ఎనర్జీ, ఎన్విరాన్మెంటల్ ఇంపాక్ట్ అసెస్మెంట్ సబ్జెక్టుల ఫలితాల్లో అవకతవకలు జరిగాయని, వాటిపై నిష్పాక్షికంగా విచారణ జరపాలని ఫోరం నాయకులు రాహుల్ నాయక్, బుర్ల సాయి తనుజ్ కుమార్ పేర్కొన్నారు.

**ఉపకులపతి స్పందన**

వినతిపత్రాన్ని స్వీకరించిన ఉపకులపతి కిషన్ కుమార్ రెడ్డి, వెంటనే పరీక్షల విభాగం డైరెక్టర్ కృష్ణ మోహన్ రావుతో మాట్లాడారు. నాన్-కన్వెన్షనల్ సోర్స్ ఆఫ్ ఎనర్జీ, ఎన్విరాన్మెంటల్ ఇంపాక్ట్ అసెస్మెంట్ ఫలితాల్లోని లోపాలు, వన్ టైమ్ ఛాన్స్ ఫలితాల జాప్యానికి కారణాలతో కూడిన నివేదికను సాధ్యమైనంత త్వరగా సమర్పించాలని ఆదేశించారు.


**విద్యార్థుల ఆవేదన**

స్టూడెంట్స్ ప్రొటెక్షన్ ఫోరం నాయకులు మాట్లాడుతూ, జేఎన్టీయూ సుల్తాన్పూర్ కళాశాలకు చెందిన సుమారు 22 మంది విద్యార్థులను అకారణంగా ఫెయిల్ చేశారని ఆరోపించారు. అదేవిధంగా భోజిరెడ్డి ఇంజినీరింగ్ మహిళా కళాశాల విద్యార్థులకు రావాల్సిన మార్కులు నాలుగో సంవత్సరం, రెండో సెమిస్టర్ ఫలితాల్లో రాలేదని తెలిపారు. ఎన్విరాన్మెంటల్ ఇంపాక్ట్ అసెస్మెంట్ ఫలితాల గందరగోళంపై కేవలం ఎవల్యుయేట్ప చర్యలు తీసుకుని సరిపెట్టకుండా, సంబంధిత అదనపు పరీక్షల నియంత్రణాధికారి, కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ పాత్రపైనా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వన్ టైమ్ ఛాన్స్ పరీక్షల ఫలితాల్లో కూడా అవకతవకలు జరిగాయని వస్తున్న వార్తలపై ఉన్నత స్థాయి కమిటీ వేసి విచారణ జరపాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు పిల్లి సిద్ధార్థ, సాగర్ నాయక్, దుర్గాప్రసాద్, ఆనంద్, జయరామ్, సంతోష్, నితిన్ కుమార్, సంగెం సిరి, జవ్వాజి దిలీప్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రజల సమస్యలపై కలెక్టర్‌కు వినతిపత్రం

కుత్బుల్లాపూర్, మనం న్యూస్ : మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి జిల్లా కలెక్టర్ మను చౌదరిని మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలోని పలు ప్రజా సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఎదురవుతున్న పలు సమస్యలను హన్మంత్ రెడ్డి కలెక్టర్కు వివరించారు. ఎండోస్మెంట్ భూములు, కమ్యూనిటీ హాళ్ల పరిస్థితి, బాచుపల్లిలోని కౌసల్య కాలనీలో భూ కబ్జా, గాజులరామారంలోని టీఎస్ఐఐసీ భూముల అంశాలను ప్రస్తావించారు. అలాగే, దుండిగల్ మున్సిపాలిటీ, బహదూర్ పల్లి, డి.పోచంపల్లి, కైసర్ నగర్, నిజాంపేట్, బాచుపల్లిలోని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో అంగన్వాడీ కేంద్రాలు, బస్తీ దవాఖానాలు, చౌక ధరల దుకాణాలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. వీటితో పాటు, నియోజకవర్గంలో ఉన్న తాగునీటి సమస్యను కూడా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ హన్మంత్ రెడ్డి ఒక వినతిపత్రాన్ని కలెక్టర్కు అందజేశారు. ప్రజల అవసరాలు, కనీస మౌలిక సదుపాయాల కల్పనలో ఎదురవుతున్న ఇబ్బందులను తొలగించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతి రెడ్డి, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా గ్రంథాలయ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, ఇతర సీనియర్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని ఈ సందర్భంగా హన్మంత్ రెడ్డి స్పష్టం చేశారు.



## రిన్యూడ్ స్టెర్లింగ్ రిజర్వ్ బి7 మార్కెట్లోకి రీలాంచ్

జూబ్లీహిల్స్,మనంన్యూస్:భారతదేశపు అతిపెద్ద స్పిరిట్స్ కంపెనీ అలైడ్ బ్లెండర్స్ అండ్ డిస్టిలర్స్ (ఏబీడీ),ఆధునిక భారతీయ వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా రిన్యూడ్ స్టెర్లింగ్ రిజర్వ్ బి7 ప్రీమియంను మార్కెట్లోకి రీలాంచ్ చేసింది.ఈ సందర్భంగా ఏబీడీ మేనేజింగ్ డైరెక్టర్ అలోక్ గుప్తా మాట్లాడుతూ కొత్త బ్లెండ్ మృదువైన రుచి, మెరుగైన ముగింపుతో ఆకట్టుకుంటుందన్నారు.దీనిని పరిచయం చేస్తూ 'సో స్మూత్, మస్ట్ బి మ్యాజిక్' అనే థీమ్తో 360-డిగ్రీల ప్రచారాన్ని చేపట్టామన్నారు.ఈ ప్రచారంలో భాగంగా 'ఆ7 మ్యాజిక్ బార్ టూర్'ను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.ఈ టూర్ హైదరాబాద్లోని ప్రముఖ సోషల్ అవుట్లెట్స్లో బ్రాండెడ్ స్టెర్లింగ్ రిజర్వ్ బి7 అనుభవాలను అందించనుందని వివరించారు.హైదరాబాద్ నగరం ప్రీమియం, సెమీ-ప్రీమియం స్పిరిట్స్ విభాగానికి కీలక మార్కెట్గా మారుతోందని,అందుకే మహారాష్ట్ర,కోల్కతా తర్వాత హైదరాబాద్లో ఈ ప్రచారాన్ని ప్రారంభించామని తెలిపారు.నగరంలో తమ అమ్మకాలు ఇక్కడి ప్రజల అధునాతన,మారుతున్న అభిరుచులను ప్రతిబింబిస్తున్నాయని పేర్కొన్నారు.ఈ నూతన బి7 బ్లెండ్ వినూత్నత,ఉత్పత్తి నాణ్యత,స్థానికతను ప్రధానంగా కలిగి ఉందన్నారు.ఇది రుచిని, సంప్రదాయాన్ని అభినందించే వారికి ప్రీమియం ఎంపికగా నిలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

## భక్తులతో కలిసి పూజల్లో పాల్గొన్న కొలన్ హన్మంత్ రెడ్డి

కుత్బుల్లాపూర్, మనం న్యూస్ : కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. బాచుపల్లి శ్రీ వరసిద్ధి వినాయక, అభయ ఆంజనేయ స్వామి దేవస్థానం ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం అభయ ఆంజనేయ సహిత నవగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.శ్రీ హోమ్స్ కాలనీ, ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు హాజరైన హన్మంత్ రెడ్డి, భక్తులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గ ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారంతో పాటు వారి ఆధ్యాత్మిక భావనలకు కూడా తాము మద్దతు ఇస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొలన్ వీరేందర్ రెడ్డి, ఎన్ఎంసి అధ్యక్షుడు కొలన్ రాజశేఖర్ రెడ్డి, జనరల్ సెక్రటరీ కొలన్ జీవన్ రెడ్డి, ఎన్ఎంసి మహిళా అధ్యక్షురాలు ఇందిరా, మహిళా జనరల్ సెక్రటరీ యశోద, కమిటీ సభ్యులు, కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నవగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తుల కోలాహలంతో ఆ ప్రాంతం సందడిగా మారింది.







## బీఆర్ఎస్ నేత కుటుంబానికి ఎంపీ ఈటల పరామర్శ

కేపీహెచ్బీ కాలనీ, మనం న్యూస్ : ఇటీవల తండ్రిని కోల్పోయి తీవ్ర విషాదంలో ఉన్న బీఆర్ఎస్ మూసాపేట డివిజన్ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ కుటుంబాన్ని మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ పరామర్శించారు. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం ఈటల, కూకట్పల్లి నియోజకవర్గంలోని భవానీనగర్లో ఉన్న శ్రీనివాస్ నివాసానికి వెళ్లారు. ముందుగా, దివంగత మల్లేష్ ముదిరాజ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించి ప్రార్థించారు. అనంతరం అంబటి శ్రీనివాస్ను, ఆయన తల్లి లక్ష్మమ్మను ఓదార్చారు. కుటుంబ పెద్దను కోల్పోవడం తీరని లోటని, ఈ కష్టకాలంలో ధైర్యంగా ఉండాలని వారికి సూచించారు. కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈటల వెంట అంబటి కుటుంబ సభ్యులు, బంధువులు ఉన్నారు. పార్టీలకు అతీతంగా ఒక నాయకుడి కుటుంబాన్ని పరామర్శించడం మానవత్వాన్ని చాటుతుందని పలువురు అభిప్రాయపడ్డారు.



## మృతుని కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఆర్థిక సాయం

(మనం ఆగస్టు04/తలకొండపల్లి): తలకొండపల్లి మండల పరిధిలోని చౌదర్ పల్లి గ్రామానికి చెందిన కాలే రామయ్య అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందడం జరిగింది.ఈ విషయాన్ని స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకుల ద్వారా తెలుసుకున్న మాజీ సర్పంచ్,మాజీ ఎంపిటిసి,రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ఏమీరెడ్డి భగవాన్ రెడ్డి కాలే రామయ్య కు ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ స్థానిక నాయకుల ద్వారా దహన సంస్కారాల కోసం రూ,2500వేల రూపాయలు మృతుని కుటుంబ సభ్యుల ఆర్థిక సాహయం స్థానిక నాయకుల ద్వారా అందించారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చంద్రయ్య,బాలమైసయ్య, భాస్కరరెడ్డిబాల్ జంగయ్య,మల్లయ్య, అంజయ్య, కృష్ణ,ప్రభాకర్,ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## శేరిలింగంపల్లిలో రూ.1.49 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన






శేరిలింగంపల్లి, మనం న్యూస్ : శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని వివేకానంద నగర్ డివిజన్లో రూ. 1.49 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు సోమవారం శంకుస్థాపన జరిగింది. స్థానిక శాసనసభ్యులు అరికెపూడి గాంధీతో కలిసి కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. జీహెచ్ఎంసీ నిధుల ద్వారా చేపడుతున్న ఈ పనులతో డివిజన్లోని పలు కాలనీల ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి. ఈ సందర్భంగా కార్పొరేటర్ రోజాదేవి మాట్లాడుతూ, పనులను త్వరగా, నాణ్యతతో పూర్తిచేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వాటిని అందుబాటులోకి తేవాలని అధికారులను కోరారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ఎల్లప్పుడూ అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని ఆమె హామీ ఇచ్చారు.ఈ అభివృద్ధి పనుల శంకుస్థాపనతో స్థానికంగా హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. ప్రజలకు మెరుగైన రోడ్లు, ఆరోగ్యానికి ఉపయోగపడే ఓపెన్ జిమ్లు అందుబాటులోకి రావడంపై వారు సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, కాలనీ అధ్యక్షులు, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

# సమగ్ర అభివృద్ధే నా ధ్యేయం

### పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ



శేరిలింగంపల్లి, మనం న్యూస్ : శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని సమగ్రంగా, సమతుల్యంగా అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ అన్నారు. వివేకానంద నగర్ డివిజన్ పరిధిలో మొత్తం రూ. 1.49 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ, బీటీ రోడ్లు, ఓపెన్ జిమ్లు నిర్మాణ పనులకు ఆయన సోమవారం శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నామన్నారు. వివేకానంద నగర్ కాలనీ, ఆల్విన్ కాలనీ ఫేస్ 1, హెచ్పీ పెట్రోల్ పంపు నుంచి పైప్లైన్ రోడ్డు కల్వర్ట్ వరకు, ఏఎస్ రాజు నగర్ కాలనీలలో చేపడుతున్న ఈ పనులతో స్థానిక ప్రజలకు ఎంతో ఉపశమనం లభిస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో శేరిలింగంపల్లిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని ఆయన హామీ ఇచ్చారు.పనుల్లో నాణ్యత విషయంలో రాజీపడొద్దని, త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. దీనివల్ల ట్రాఫిక్ సమస్యలు తగ్గి, సుఖవంతమైన ప్రయాణానికి వీలు కలుగుతుందని పేర్కొన్నారు.



### ఆరోగ్యం పట్ల శ్రద్ధ అవసరం

నూతనంగా ఏర్పాటు చేయనున్న ఓపెన్ జిమ్లు గురించి గాంధీ మాట్లాడుతూ, ఉదయం, సాయంత్రం వాకింగ్కు వచ్చే పిల్లలు, పెద్దలు, వృద్ధులకు ఇవి ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ వ్యాయామం చేయాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. ఆరోగ్యంగా ఉంటేనే ఏదైనా సాధించగలమని, ఆరోగ్యమే మహా భాగ్యం అని ఆయన గుర్తుచేశారు. మొక్కలు నాటి, పార్కులను సంరక్షించే బాధ్యత అందరిదని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావుతో పాటు నాయకులు, కార్యకర్తలు, కాలనీ అసోసియేషన్ సభ్యులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శంకుస్థాపన చేసిన పనుల వివరాలు కింది విధంగా ఉన్నాయి.





## ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత : ధనరాజ్ యాదవ్

కుత్బుల్లాపూర్,మనం న్యూస్ : నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాచుపల్లి శ్రీ హోమ్స్ కాలనీలో జరిగిన శ్రీ అభయ ఆంజనేయ సహిత నవగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం భక్తిశ్రద్ధలతో జరిగింది. సోమవారం జరిగిన ఈ వేడుకకు నిజాంపేట్ మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్, మాజీ కార్పొరేటర్లు రవి కిరణ్, పెడిరెడ్డి సుజాత ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆధునిక జీవనశైలిలో మనుషులు ఎదుర్కొంటున్న ఒత్తిడి, ఆందోళనల నుంచి బయటపడటానికి ఆధ్యాత్మిక చింతన ఒక మంచి మార్గమని పేర్కొన్నారు. పూజలు, దేవాలయాల సందర్శనలు మనసుకు ప్రశాంతతను ఇస్తాయని అన్నారు. ఆలయాల అభివృద్ధికి నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. అలాగే, స్వామివారి దీవెనలు ప్రజలందరిపై ఉంటాయని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు మేకల మధుసూదన్, సంబశివ రెడ్డి, శ్రీ వరసిద్ధి వినాయక, అభయ ఆంజనేయ స్వామి దేవస్థానం ట్రస్టు ఛైర్మన్ ప్రదీప్ తాళ్ళూరి, కమిటీ సభ్యులు సంభాశివరావు, విజయ్, ఆనంద్, కిరణ్ కుమార్, వెంకటేశ్వర రావు, శేషి, సంతోష్, రామోజీ రావు, కాలనీ వాసులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆధ్యాత్మిక వాతావరణం, భక్తి గీతాలతో కాలనీ మొత్తం మార్మోగింది. ఈ ప్రతిష్టాపన మహోత్సవం కాలనీ వాసులకు ఒక గొప్ప అనుభూతిని మిగిల్చింది. ప్రతిష్టాపన సందర్భంగా చేసిన అన్నదాన కార్యక్రమం కూడా భక్తులందరినీ ఆకట్టుకుంది. ఈ ప్రాంతంలో కొత్తగా నిర్మించిన ఆలయం ఆధ్యాత్మిక కేంద్రంగా మారుతుందని అందరూ ఆనందం వ్యక్తం చేశారు.



## మాగంటి గోపీనాథ్, సద్దార్ సేవలకు సలాం

కుత్బుల్లాపూర్, మనంన్యూస్: జూబ్లీహిల్స్ నియోజకవర్గం బోరబండ డివిజన్లోని పిజెఆర్ గ్రౌండ్స్లో ఆదివారం సాయంత్రం దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, మైనార్టీ నాయకుడు మహమ్మద్ సద్దార్ సంతాప సభ జరిగింది. ఈ కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి వివేకానంద్, మాజీ ఉప ముఖ్యమంత్రి మహమ్మద్ అలీ, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, జూబ్లీహిల్స్ మాజీ ఎమ్మెల్యే విష్ణు వర్ధన్ రెడ్డి, రాష్ట్ర మాజీ చైర్మన్ రావుల శ్రీధర్ రెడ్డి హాజరయ్యారు.సభలో గోపీనాథ్, సద్దార్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ముఖ్య అతిథులు మాట్లాడుతూ, గోపీనాథ్ ప్రజలకు చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. నియోజకవర్గంలోని ప్రతి ఇంటిలో ఆయన ఒక కుటుంబ సభ్యుడిగా మెలిగారని, ప్రతి పేదవారిని ఆదుకున్న నిరాడంబర నాయకుడని కొనియాడారు. ఇంటికి వచ్చిన ఎవరినీ ఖాళీ చేతులతో పంపించకుండా తోచిన సహాయం చేసి, అందరినీ తనవారిగా చూసుకున్నారని చెప్పారు.ఈ కార్యక్రమంలో గోపీనాథ్ భార్య సునీతా మాగంటి గోపీనాథ్, వారి కుటుంబ సభ్యులు, మహమ్మద్ సద్దార్ కుటుంబ సభ్యులు, కార్పొరేటర్లు దేదీప్య రావు, రాజ్ కుమార్, మాజీ కార్పొరేటర్ శ్యామ్ కుమార్, డివిజన్ అధ్యక్షుడు కృష్ణమోహన్, సీనియర్ నాయకులు అబ్దుల్లా సోహెల్, ఖదీర్ భాయ్, మహిళా నాయకురాలు మేరీ తదితరులు పాల్గొన్నారు. వివిధ డివిజన్ల నుంచి పెద్ద సంఖ్యలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానికులు హాజరయ్యారు.



# నిజాంపేట్లో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన



కుత్బుల్లాపూర్, మనం న్యూస్ : కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో శిథిలావస్థకు చేరిన సీసీ రోడ్ల సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. నియోజకవర్గ ఇన్చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి చొరవతో 33, 31వ డివిజన్లలో కార్పొరేషన్ నిధుల నుంచి సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. ఆదివారం ఈ నిర్మాణ పనులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు.గత కొద్ది నెలలుగా ఈ రెండు డివిజన్లలోని రోడ్లు పూర్తిగా పాడైపోవడంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనదారులు, పాదచారులు రాకపోకలకు అవస్థలు పడ్డారు. ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ గత నెలలో కాలనీ వాసులు నియోజకవర్గ ఇన్చార్జి కొలన్ హన్మంత్ రెడ్డిని కలిసి విన్నవించారు. వారి గోడు ఆలకించిన హన్మంత్ రెడ్డి వెంటనే స్పందించి, కార్పొరేషన్ నిధుల నుంచి నిధులు మంజూరు చేయించారు.శంకుస్థాపన కార్యక్రమంలో కొలన్ హన్మంత్ రెడ్డితో పాటు సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు తమ సమస్యను పరిష్కరించినందుకు వారికి శాలువాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల సమస్యలను పరిష్కరించడమే తమ ప్రధాన లక్ష్యమని కొలన్ హన్మంత్ రెడ్డి ఈ సందర్భంగా పేర్కొన్నారు. అభివృద్ధి కార్యక్రమాలకు ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తామని ఆయన హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఎన్ఎంసి జనరల్ సెక్రటరీ కొలన్ జీవన్ రెడ్డి, బీసీ ఉపాధ్యక్షులు లక్ష్మణ్, 33వ డివిజన్ అధ్యక్షులు పి. ప్రభాకర్ రెడ్డి, బాలకృష్ణ, 31వ డివిజన్ అధ్యక్షులు పితాని శ్రీనివాసరావు, నరసింహారావు, రాంచందర్ నాయక్, దాల్ నాయుడు, ఆటో శ్రీను, గౌస్ బాయ్, భుజంగ రెడ్డి, రాయుడు, వెంకట్ రెడ్డి, సరితా రెడ్డి, రాధా జ్యోతి, ధనలక్ష్మి, నవ్య బేకరీ, సత్యవతి, చిరంజీవి, ఈశ్వర్, రాజు తదితర సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ రోడ్ల నిర్మాణం పూర్తి కావడంతో స్థానిక ప్రజలు ఊరట చెందారు.



## ప్రజావాణిలో స్వీకరించిన సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి**

మేడ్చల్, ఆగస్టు4( మనం జిల్లా ప్రతినిధి): ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు అందజేస్తూ జాప్యం లేకుండా సత్వరమే అర్జీలను పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు మిక్కిలినేని మను చౌదరి అధికారులను ఆదేశించారు. సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి అదనపు కలెక్టర్లు రాధికగుప్తా, విజయేందర్ రెడ్డి, డిఆర్ఓ హరిప్రియలతో కలిసి కలెక్టరు 91 దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టరు మను చౌదరి మాట్లాడుతూ ఎంతో వ్యయ, ప్రయాసలకోర్చుకొని వారి సమస్యలను పరిష్కరిస్తామనే నమ్మకంతో ప్రజలు మన వద్దకు వస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత మనందరి పైన ఉన్నదని అన్నారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని దరఖాస్తుల పరిశీలనలో ఏలాంటి జాప్యం ఉండకూడదని కలెక్టరు అన్నారు. అదేవిధంగా తిరస్కరించే దరఖాస్తుల గురించి తిరస్కరణకు గల కారణాలను తప్పనిసరిగా వివరంగా అర్జీదారులకు తెలియజేయాలని అధికారులకు సూచించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్ లైన్ లో వెంట వెంట నమోదు చేయాలని సంబంధిత అధికారులకు కలెక్టరు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## వుషూ పోటీలలో సెయింట్ పీటర్స్ ఇంజనీరింగ్ కళాశాల ప్రతిభ

మేడ్చల్, ఆగస్టు 4( మనం జిల్లా ప్రతినిధి): సంగారెడ్డి లోని చవాన్ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన సీనియర్ ఖేలో ఇండియా వుషూ ఉమెన్స్ లీగ్ పోటీల్లో సెయింట్ పీటర్స్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థినుల అద్భుతమైన ప్రదర్శనతో పలు పతకాలను సాధించారు. ఈ పోటీలను మెదక్ జిల్లా వుషూ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వుషూ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ, తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ గుర్తింపుతో నిర్వహించారు. ఈ పోటీల్లో ఈసీఈ కి చెందిన ఎం. హరిణి సిల్వర్ మెడల్ ను సాధించారు సీఎస్ఎం కు చెందిన కే రామేశ్వరి సిల్వర్ మెడల్ సి ఎస్ ఈ కి చెందిన బి. సాయి వర్షిని బ్రోంజ్ మెడల్ సాధించారు. సి ఎస్ ఎం విద్యార్థిని ఎస్. సోజన్య సిల్వర్ మెడల్ ఈసీఈ విద్యార్థిని టి. మహేశ్వరి సిల్వర్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ టీవీ రెడ్డి, డైరెక్టర్స్ సరోజ రెడ్డి, అనురాగ్ రెడ్డి , ప్రిన్సిపాల్ డా. చంద్ర శేఖర్ రెడ్డి , వీ ఆర్ ఓ రవి సుధాకర్ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపి మాట్లాడుతూ విద్యార్థులకు సరైన మార్గదర్శనం, అవకాశాలు కల్పిస్తే వారు రాష్ట్ర, జాతీయ స్థాయిలోనూ సత్తా చాటుతారు అన్నారు. స్పోర్ట్స్ రంగంలో సెయింట్ పీటర్స్ ఇంజనీరింగ్ కళాశాల కళాశాల ఎప్పుడూ ముందుంటుందని తెలిపారు.

## కోకాపేటలో 3ఎమ్ కార్ కేర్ స్టూడియో ప్రారంభం



కేపీహెచ్బీ కాలనీ, మనం న్యూస్ : కోకాపేటలో నూతనంగా ఏర్పాటు చేసిన 3ఎమ్ కార్ కేర్ స్టూడియోను సోమవారం పీఏసీ చైర్మన్, ఆరెకపూడి గాంధీ ప్రారంభించారు. ఆయన వెంట రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ కూడా ఉన్నారు. 3ఎమ్ కార్ కేర్ స్టూడియోకు ఇది మూడో బ్రాంచ్ కావడం విశేషం.ఈ సందర్భంగా పీఏసీ చైర్మన్ మాట్లాడుతూ నల్లగండ్ల, కొంపల్లి, కోకాపేట ప్రాంతాల ప్రజలకు ఈ స్టూడియో చాలా ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రీమియం కార్ కేర్ సేవలు అయిన డీటైలింగ్, పెయింట్ ప్రొటెక్షన్, టింటింగ్ వంటి సేవలు ఇక్కడ లభిస్తాయని ఆయన తెలిపారు. నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా సరసమైన ధరలకే సేవలు అందించడం ఈ స్టూడియో ప్రత్యేకత అని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు. ఈ నూతన కార్ కేర్ స్టూడియో ప్రారంభంతో ఆ ప్రాంత కార్ల యజమానులకు నాణ్యమైన సేవలు అందుబాటులోకి వచ్చాయి.



## నాలాలో పూడిక తొలగించాలని కార్పొరేటర్ సూచన

కేపీహెచ్బీ కాలనీ, మనం న్యూస్ : ఇటీవల కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో కూకట్పల్లిలోని కబీర్ నగర్ నాలా వద్ద నీటి ఉధృతిని స్థానిక కార్పొరేటర్ కొడిచర్ల మహేందర్ పరిశీలించారు. జోరు వానలో ఆయన స్వయంగా అక్కడి పరిస్థితిని గమనించి, మాన్సూన్ ఎమర్జెన్సీ సిబ్బందికి పలు సూచనలు చేశారు.నాలాలోకి క్యాచ్ పిట్ ద్వారా వెళ్లే నీటితో పాటు చెత్తాచెదారం కూడా చేరి పూడిక ఏర్పడే అవకాశం ఉందని కార్పొరేటర్ మహేందర్ తెలిపారు. దీనివల్ల నీరు సక్రమంగా పారకుండా రోడ్లపైకి చేరే ప్రమాదం ఉందని, తద్వారా వాహనదారులకు, బస్తీ ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ఎప్పటికప్పుడు జాగ్రత్త వహించి నాలా పూడిక తొలగించాలని, నీటి ప్రవాహానికి ఆటంకాలు లేకుండా చూడాలని సూచించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు సతీష్ చారి కూడా పాల్గొన్నారు. వర్షాల సమయంలో ప్రజలకు ఎలాంటి సమస్యలు రాకుండా చూడటమే తమ లక్ష్యమని మహేందర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## బీసీ ధర్నాకు తరలిరావాలి

**ఆమనగల్లు మార్కెట్ చైర్మన్ గీత నర్సింహా**



కడ్తాల్, ఆగస్టు 4 ( మనం, న్యూస్ ) : బీసీ రిజర్వేషన్ అమలుకై ఢిల్లీలో నిర్వహించే మహా ధర్నాకు కల్వకుర్తి నియోజకవర్గం నుంచి బీసీలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆమనగల్లు మార్కెట్ చైర్ పర్సన్ యాట గీత నర్సింహా సోమవారం ఓ ప్రకటనలో కోరారు. కడ్తాల్, ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, వెల్దండ మండలాల నుంచి బీసీలు నేడు ఢిల్లీలో నిర్వహించే ధర్నాకు పెద్ద సంఖ్యలో తరలిరావాలని యాట గీత నర్సింహా కోరారు.

## రైలుకు ఎదురెళ్లి మల్లికార్జున అనే వ్యక్తి మృతి

ఘట్కేసర్ మనం న్యూస్ ఆగస్టు 04: మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ రైల్వే స్టేషన్ పరిధిలోని యంనంపేట రైల్వే బ్రిడ్జి క్రింద జగద్గిరి గుట్టకు చెందిన మల్లికార్జున అనే వ్యక్తి రైల్ ఎదురు వెళ్లి ఆత్మహత్యకు చేసుకున్నాడు. ఇతనికి భార్య ముగ్గురు ఆడపిల్లలు. ఆటో డ్రైవర్ గా జీవనం కొనసాగిస్తున్నాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. ఘటన స్థలాన్ని చేరుకున్న రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకొని డెడ్ బాడీని గాంధీ మార్చురీకి కి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు..





INDIAN UNION DRIVING LICENSE
TELANGANA STATE
TS01020140005160
D MALLIKARJUN
D KISTAIAH
5-25-499, SRI RAMA NAGAR, J GUTTA, HYDERABAD
Signature
Issued On: 03/09/2024
License Authority
RTA-HYDERABAD-NZ

# గణేష్ ఉత్సవాలు భక్తిభావంతో ప్రశాంతంగా జరుపుకోవాలి

**గణేష్ చందాలు చేయని గ్రామంగా మైసిగండి ఆదర్శం**



**మైసిగండి నూతనంగా ఎన్నికైన గణేష్ ఉత్సవ కమిటీని సన్మానిస్తున్న పిసిసి సభ్యులు ఆయిళ్ళ శ్రీనివాస్ గౌడ్**

కడ్తాల్, ఆగస్టు 04 ( మనం, న్యూస్ ) : మండలంలోని మైసిగండిలో సోమవారం మైసిగండి గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దల సమక్షంలో సమావేశం నిర్వహించి నూతనంగా కొత్త కమిటీని ఎన్నుకున్నారు. చైర్మన్ గా సభవత్ వినోద్ నాయక్, వైస్ చైర్మన్ గా జరుపుల నరేష్ నాయక్, ప్రధాన కార్యదర్శి సభవత్ రాము నాయక్, కార్యదర్శి విస్లావత్ సుధీర్ నాయక్, కోశాధికారి గా కేతావత్ తులసిరామ్ నాయక్, 10 మంది కార్యవర్గ సభ్యులు గా గ్రామ పెద్దలను ముఖ్య సలహా దారులు గా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ చందాలు చేయని గ్రామంగా మైసిగండికి పేరుందని గత ముప్పై సంవత్సరాలుగా జిల్లాలో వైభవంగా గణేష్ ఉత్సవాలు జరుగుతున్నాయని లడ్డు ధర కూడా ఎక్కువ మొత్తం లో పలుకుతుందని చందాలు చేసి ఒకరిని ఇబ్బంది పెట్టె తత్త్వం మైసిగండి ప్రజలకు లేనందుకు సంతోషపడుతున్నానని శ్రీనివాస్ గౌడ్ అన్నారు. గణేష్ పండుగను ఐకమత్యం తో అందరూ కొత్త బట్టలతో పూజా పునస్కారాలతో కలిసికట్టుగా ఒకే రోజు నిమజ్జనం చేసి పండుగ వాతావరణం మైసిగండి లో ఉంటుందని మైసిగండి ఐకమత్యం అందరికీ ఆదర్శం అని అన్నారు. నూతనంగా ఎన్నికైన గణేష్ ఉత్సవ కమిటీ నాయకులతో కలిసి శ్రీనివాస్ గౌడ్ సన్మానించారు. వారికీ శుభాకాంక్షలు తెలుపడం జరిగింది.గణేష్ ఉత్సవ కమిటీ, గణేష్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని దానికి మా సహకారం ఉంటుందని సూచించారు. ఈ సందర్భంగా గత మూడు సంవత్సరాలుగా గణేష్ ఉత్సవాలు నిర్వహిస్తున్న గణేష్ ఉత్సవ కమిటీ చైర్మన్ కేతావత్ హీరాసింగ్ నాయక్ ను, ఉపాధ్యక్షులు సభవత్ రామునాయక్ ను, సభవత్ యాదగిరి నాయక్ ను పాత కమిటీ సభ్యులను సన్మానించి వారి సేవలు కొనసాగాలని కోరడం జరిగింది.

ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తులసిరామ్ నాయక్, సింగల్ విండో డైరెక్టర్ చేగురి వెంకటేష్, సీనియర్ నాయకులు జహార్ లాల్ నాయక్, మాజీ చైర్మన్ హిరాసింగ్ నాయక్, భగవాన్ ఫౌండేషన్ చైర్మన్ దుద్యా నాయక్, తులసిరామ్ యాదగిరి,రాము కొర్ర శీను, రమేష్, భోని, శంకర్, గోపి, అమర్ సింగ్, చిన్న, సుధీర్, చందు, అర్జున్, సాయికుమార్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



## మెడిసిటీ స్థల వివాదంపై పూర్తిస్థాయి విచారణ జరుపుతాం

**మనం జిల్లా ప్రతినిధితో మేడ్చల్ తహసిల్దార్ భూపాల్**

మేడ్చల్, ఆగస్టు 4( మనం జిల్లా ప్రతినిధి): మేడ్చల్ మున్సిపల్ పరిధి ఘనపూర్ లోని మెడిసిటీ ఆసుపత్రి ఆధీనంలో ఉన్న వివాదాస్పద స్థలం విషయంలో సమగ్ర విచారణ జరుగుతామని మేడ్చల్ తహసిల్దార్ భూపాల్ తెలిపారు. ఈ సందర్భంగా మనం జిల్లా ప్రతినిధితో తహసిల్దార్ భూపాల్ మాట్లాడుతూ షామీర్పేట్ పెద్ద చెరువు బఫర్ జోన్ లో సర్వేనెంబర్ 94 లోని రెండు ఎకరాల భూమి ఉన్నట్లు గుర్తించమని తెలిపారు. అయితే ఈ స్థలంలో ఉన్న వ్యాపార సంస్థలు బఫర్ జోన్ లో ఉన్నాయా లేవా గుర్తించి, ఒకవేళ ఉంటే వాటిని కచ్చితంగా తొలగిస్తామని తాసిల్దార్ తెలిపారు. బఫర్ జోన్ లో ఎలాంటి వ్యాపారాలు చేయొద్దని నిబంధనలు ఉన్నాయని తెలిపారు. అయితే గత 15 ఏళ్ల నుండి ఈ స్థలంలో వెహికల్ స్టాండ్ నడపడంతో పాటు వాహనదారుల నుండి రుసుం వసూలు చేయడం.. హోటల్, జ్యూస్ సెంటర్లు నడపడం వంటి అంశాలపై సమగ్ర విచారణ జరుగుతామని మేడ్చల్ తాసిల్దార్ భూపాల్ తెలిపారు

## కుషాయిగూడ డిపోకు చెందిన బస్సులో మహిళ సెల్ ఫోన్ చోరీ

**బాధితురాలికి సహాయం చేయకుండా దుర్భాషలాడి నిర్లక్ష్యం వహించిన బస్సు డ్రైవర్, కండక్టర్**

మేడ్చల్, ఆగస్టు 04 ( మనం జిల్లా ప్రతినిధి): కుషాయిగూడ డిపోకు చెందిన బస్సు లో సెల్ఫోన్ చోరీ గురైంది. కుసాయి గూడ డిపోకు చెందిన బస్సు నెంబర్ 242జీ లో తంగళ్లపల్లి స్వాతి అనే మహిళ సోమవారం ఈసీఐఎల్ నుండి కీసరకు ప్రయాణం చేస్తున్నారు. అయితే మార్గమధ్యంలో గుర్తు తెలియని వ్యక్తులు స్వాతి మొబైల్ ను తస్కరించారు. సెల్ ఫోన్ చోరీకి గురైన విషయం గ్రహించిన స్వాతి వెంటనే తేరుకుని బస్సులో అందరినీ తనిఖీ చేసి తన ఫోన్ తనకు




ఇప్పించాలని బస్సు డ్రైవర్, కండక్టర్ ను ఎంత ప్రాధేయపడినా వారు కనికరించలేదు. కనీసం పోలీసు స్టేషన్ కు తీసుకెళ్లి అందరినీ చెక్ చేయాలని ఎంత బ్రతిమిలాడినా డ్రైవర్, కండక్టర్ పట్టించుకోకపోవడమే కాకుండా నానా దుర్భాషలాడుతూ నిర్లక్ష్యం వహించారని స్వాతి ఆవేదనవ్యక్తం చేశారు. బస్సులో చాలా మంది ప్రయాణికులు ఫోన్ లు, విలువైన వస్తువులు పోగొట్టుకుంటారు, కొందరు మా ముందే గంజాయి తీసుకుంటారు మాకేంటి సంబంధం, మాకనవసరం ఏం చేసుకుంటావో చేసుకోపో అని తనను బెదిరించి బస్సు ఆపకుండా వెళ్లిపోయారని స్వాతి ఆరోపించారు. బస్సు ఆపి ప్రయాణికులను తనిఖీ చేస్తే తన విలువైన మొబైల్ ఫోన్ తనకు దొరికేదని స్వాతి కన్నీరు మున్నీరయ్యింది. బస్సు డ్రైవర్, కండక్టర్ నిర్లక్ష్య ధోరణి, తనను దుర్భాషలాడిన సంఘటనపై కుషాయిగూడ డిపో మేనేజర్ ను కలిసి పిర్యాదు చేయనున్నట్లు స్వాతి తెలిపారు

# గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తుంది

**ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తాం**

**ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి**



ఇబ్రహీంపట్నం ఆగస్టు 4 మనం న్యూస్: గ్రామాల అభివృద్ధి కోసం ఎన్ని నిధులు అయినా మంజూరు చేస్తామనీ, అర్హులైన వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తామని ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఈ మేరకు అనాజ్ పూర్, గుంతపల్లి, మజీద్ పూర్ గ్రామాలలో దాదాపు 80 లక్షల నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి. అనాజ్ పూర్ గ్రామంలో శ్రీశ్రీశ్రీ ఏడు తలకాయల మైసమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, రాష్ట్ర రోడ్డు డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి. అనంతరం అధికారులతో, మహిళ సంఘం సభ్యులతో కలిసి హరిత హారం కార్యక్రమంలో మొక్కలను నాటిన ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి.



ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కోసం ఎన్ని నిధులు అయినా మంజూరు చేస్తామన్నారు. అర్హులైన వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తామని తెలిపారు. ప్రజా సంక్షేమం కోసమే పనిచేస్తున్నామని అన్నారు. ప్రతి గ్రామంలో ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామన్నారు. 200 యూనిట్ల లోపు గృహ జ్యోతి అమలు చేస్తున్నామని, అర్హులైన లబ్ధిదారులకు రేషన్ కార్డులు మంజూరు చేస్తున్నామని, సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని, రైతు బరోసా, రైతు ఋణ మాఫీ అందించామని తెలిపారు. మహిళల కు మహాలక్ష్మి పథకం ద్వారా ఉచితంగా బస్సు సౌకర్యం కల్పిస్తున్నామని, వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం లో అభివృద్ధికి గ్రామాలు నోచుకోలేదని...కేవలం గత ప్రభుత్వం కమిషన్లు దండుకోని గ్రామాల అభివృద్ధిని పట్టించుకోలేదని విమర్శించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి రోజు ప్రజల కోసం పని చేస్తున్నామని చెప్పారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా కాంగ్రేస్ గెలుస్తుందని అన్నారు.


ఈ కార్యక్రమంలో రాష్ట్ర రోడ్డు డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి, గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, వైస్ చైర్మన్ సిహెచ్ భాస్కర చారి, మాజీ జడ్పిటిసి బింగి దేవదాస్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు కొత్త ప్రభాకర్ గౌడ్, గుంతపల్లి మాజీ సర్పంచ్ కరిమెల వెంకటేష్, మాజీ ఎంపీటీసీ మేడిపల్లి బాలమ్మ వెంకటేష్, నాయకులు గుండ్లపల్లి ధన్ రాజ్ గౌడ్, ఏళ్ల బాల్ రెడ్డి, ఏళ్ల నరేందర్ రెడ్డి, ఏర్కలి అశోక్ గౌడ్, పాలెం శ్రీనివాస్ గౌడ్, ఏర్పుల శివయ్య, నార్లకొండ శ్రీశైలం యాదవ్, కంటేకార్ రమేష్, శ్రీధర్, ఎండీ,అఫ్సర్..తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీ రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్టాపన

**విగ్రహ ప్రతిష్టాపనకు హాజరైన మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్**

**పెద్ద ఎత్తున హాజరైన భక్తులు ప్రత్యేక పూజలు**

కడ్తాల్, ఆగస్టు 4 (మనం, న్యూస్) : కడ్తాల్ మండలంలోని ఎక్వాయి పల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాలు వైభవంగా అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నారు. మూడు రోజులపాటు జరిగే కార్యక్రమానికి సోమవారం కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, డిసిసిబి డైరెక్టర్ ఆమనగల్లు సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా, మాజీ జెడ్పిటిసి జర్పుల దశరథ్ నాయక్, మాజీ సర్పంచ్ లక్ష్మీనరసింహారెడ్డిలు హాజరై ఎల్లమ్మ దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎక్వా యిపల్లి గ్రామమంతా భక్తిశ్రద్ధలతో ఎల్లమ్మ దేవతకు పూజలు నిర్వహించారు.



**శ్రీ రేణుక ఎల్లమ్మ కు విరాళాల అందజేత**

కడ్తాల్ మండలంలోని ఎక్వా యిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శ్రీ రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠకు హాజరైన మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ రూ .10,000 గంప లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డిసిసిబి డైరెక్టర్ గంప వెంకటేష్ గుప్తా ట్రస్ట్ తరఫున రూ .10,000 కడ్తాల్ మాజీ జెడ్పిటిసి జర్పుల దశరథ్ నాయక్ రూ 11వేలు, కడ్తాల్ మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్ రూ 30వేలు, కడ్తాల్ మాజీ సర్పంచ్ లక్ష్మీనరసింహారెడ్డి, రూ 5వేలు మాజీ ఎంపిటిసి లచ్చిరాం నాయక్ రూ 5వేలు జనిగల మహేష్ యాదవ్ రూ. 50వేలు నగదు రూపకంగా విరాళాలు ఆలయ కమిటీ నిర్వాహకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జోగు వీరయ్య, మాజీ సర్పంచ్ సుగుణ సాయిలు, మాజీ ఎంపీటీసీ ఉమావతి, మాజీ ఉప సర్పంచ్ ముత్యాలు, నాయకులు సుమన్ , పాలకూర యాదయ్య, పూల్టి యాదయ్య,గంటి బిక్షపతి, పాలకూర కర్నాకర్, వాడాల బాలరాజ్, నాయకులు జంగం శంకర్, బిఆర్ఎస్ యువ నాయకులు జనిగల మహేష్ యాదవ్, దొడ్లపాడు జంగయ్య, సభావాత్ రమేష్, మధు ఆంజనేయులు, పుల్టి లక్ష్మణ్, జగదీష్, విగ్రహదాత కొండల్ రెడ్డి పాల్గొన్నారు.

# ప్రజల ఆరోగ్యమే ఐక్యత ఫౌండేషన్ లక్ష్యం

**ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి**

కడ్తాల్, ఆగస్టు 4 ( మనం, న్యూస్ ) : ప్రజల ఆరోగ్యమే ఐక్యత ఫౌండేషన్ లక్ష్యమని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అన్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య సేవలు ఉచితంగా అందించాలనే ఉద్దేశంతో గ్రామ, గ్రామాన సుంకిరెడ్డి - మొబైల్ హెల్త్ ఏర్పాటు చేయడం జరుగుతుందని టాస్క్ సిఓఓ ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి తెలిపారు. సోమవారం ఆమనగల్లులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన వెల్లడించారు. ఐక్యత ఫౌండేషన్ ముఖ్య లక్ష్యం నియోజకవర్గ వ్యాప్తంగా విద్య - వైద్యం - ఉపాధి రంగాలలో ప్రతి కుటుంబానికి అండగా ఉండాలనే ధృడ సంకల్పంతో ముందుకు వెళ్తున్నామని, మా సంకల్పం ప్రతి గ్రామానికి, ప్రతి కుటుంబానికి ప్రాథమిక వైద్యసేవలు ఉచితంగా అందుబాటులో ఉంచి, ఆరోగ్యవంతమైన నియోజకవర్గాన్ని చూడాలనే ప్రయత్నం చేస్తున్నానని అన్నారు. సుంకిరెడ్డి మొబైల్ హెల్త్ క్యాంపులను వన్ మెడి హబ్ అనే



ప్రముఖ సంస్థతో కలిసి నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు.

సుంకిరెడ్డి మొబైల్ హెల్త్ క్లినిక్ యొక్క ముఖ్య ఉద్దేశ్యాలు. ప్రతి గ్రామానికి, ప్రతి కుటుంబానికి ఉచిత ప్రాథమిక వైద్యసేవలను అందించడం, పెద్ద పెద్ద వ్యాధులను ముందుగా గుర్తించి, వాటిని అడ్డుకోకునే,సూచనలు సలహాలు, ప్రతి మారుమూల గ్రామంలో కూడా ఆరోగ్యం పై అవగాహన కల్పించి, వారిని చైతన్య పరచడం, సుంకిరెడ్డి మొబైల్ హెల్త్ క్యాంప్ ద్వారా ముఖ్యంగా ఆధునాతన టెక్నాలజీ తో రూపొందించిన వన్ మెడి హబ్ మొబైల్ క్లినిక్ ద్వారా ఒక గంటలో 150 పైగా పరీక్షలు నిర్వహించే సామర్థ్యంతో డిజైన్ చేయడం జరిగిందని తెలిపారు. ముఖ్యంగా ఆరోగ్యానికి సంబంధించిన పరీక్షలు చాలా ఖర్చుతో కూడుకున్న ప్రక్రియ అని, ఖర్చుకి వెనకడుగు వేస్తూ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్న మారుమూల గ్రామ ప్రజలకు దృష్టిలో ఉంచుకొని ఈ కార్యక్రమంతో ముందుకు వెళుతున్నామని ముఖ్యంగా

మా మొదటి క్యాంప్ ఆమనగల్ మండలం మేడిగడ్డ తండాలో ఈనెల 6వ తారీఖు బుధవారం రోజున ప్రారంభించబోతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వన్ మెడి హబ్ ఫౌండర్ సంతోష్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు మండ్లి రాములు, మాజీ సర్పంచ్ రచ్చ శ్రీరాములు, మాజీ ఉపసర్పంచ్ మల్లేష్ నాయక్, యువజన కాంగ్రెస్ జిల్లా నాయకులు అభినవ్ రెడ్డి, యువజన నాయకులు దుడ్డు కృష్ణ యాదవ్ లతో పాటు ఐక్యత ఫౌండేషన్ సభ్యులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# 42 శాతం బీసీ రిజర్వేషన్ కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆమోదించాలి

**రేపు ఇందిరా పార్క్ ధర్నా ను విజయవంతం చేయాలి**

**సిపిఎం పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి కామ్రేడ్ పగడాల యాదయ్య**



కడ్తాల్, ఆగస్టు 04 ( మనం, న్యూస్ ) : 42 శాతం బీసీ రిజర్వేషన్ కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఆమోదించాలని ఇందిరా పార్క్ వద్ద జరిగే ధర్నాను పెద్ద ఎత్తున బిసి సామాజిక వర్గం హాజరై విజయవంతం చేయాలని సిపిఎం పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య తెలిపారు. కడ్తాల్ మండల కేంద్రంలో స్థానిక ఓ గార్డెన్ లో పార్టీ ముఖ్య నాయకుల విస్తృతస్థాయి సమావేశం శివగల రమేష్ అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సిపిఎం పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి కామ్రేడ్ పగడాల యాదయ్య కార్యదర్శి వర్గ సభ్యులు మరియు కామ్రేడ్ కందుకూరి జగన్ హాజరై మాట్లాడుతూ... బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు రాష్ట్ర ప్రభుత్వం తీసుకు వచ్చినప్పటికీ కేంద్ర బిజెపి ప్రభుత్వము అట్టి బీసీ రిజర్వేషన్లు అడ్డుకునే ప్రయత్నం చేస్తుందని తక్షణమే బీసీ రిజర్వేషన్లు ఆమోదించి అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బి సి సామాజిక వర్గాన్ని ఏకం చేసి భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. అదేవిధంగా బీహార్ రాష్ట్రంలో ఎలక్షన్ కమిషన్ తో కుమ్మక్కై లక్షల ఓటర్లను తొలగించినటువంటి బీహార్ ఎన్నికల కమిషన్ కు వ్యతిరేకంగా ఈనెల 8న పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని మరియు తెలంగాణ సాయుధ పోరాటాన్ని ఆర్ఎస్ఎస్ బిజెపి మతోన్మాదులు హిందూ ముస్లింల పోరాటంగా చిత్రీకరించి చరిత్రను వక్రీకరించే పోరాటం చేస్తున్నారని ఆరోపించారు. దీనిపైన సెప్టెంబర్ 1 నుంచి 17 వరకు జిల్లా వ్యాప్తంగా సభలు సదస్సులు సంస్కృతిక కార్యక్రమాలు బైకు యాత్ర వంటి కార్యక్రమాలు నిర్వహించి తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను ఘనతను ఇంటింటికి తెలియజెప్పాలని వీరు ఈ సందర్భంగా తెలిపారు.

ఈ కార్యక్రమానికి సిపిఎం పార్టీ అమనగల్ ఏరియా కన్వీనర్ పిప్పల శివశంకర్, నాయకులు గుమ్మడి కురుమయ్య, జల్లెల పెంటయ్య, శివగల రమేష్, తొగరి పోచయ్య, నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

# యువత స్వయంకృషితో ఎదగాలి

**ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్ రెడ్డి, వైస్ చైర్మన్ కరుణాకర్**

ఇబ్రహీంపట్నం ఆగస్టు 4 మనం న్యూస్: యువత స్వయం కృషి తో ఎదగాలనీ ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మెన్ కంబాలపల్లి గురునాథ్ రెడ్డి, ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మంకాల కరుణాకర్ అన్నారు. ఇబ్రహీంపట్నం మున్సిపల్ లో తూలేకలన్(పెత్తుల్ల) గ్రామానికి చెందిన గడలసాయి హనుమాన్ బార్బర్ షాపును ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ కంబాలపల్లి గురునాథ్ రెడ్డి, వైస్ చైర్మన్ మంకాల కరుణాకర్ లు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... యువత స్వయం కృషి తో ఎదగాలని, యువత ఉపాధి అవకాశాలు పెంచుకోవాలని, యువత చెడు మార్గంలో నడవకుండా ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చిన రాకున్నా ఉపాధి అవకాశం పెంచుకోవాలని యువతకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ మండల్ అధ్యక్షులు జడల రవీందర్ రెడ్డి,





ఇబ్రహీంపట్నం మండల్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోడూరి రమేష్, కాంగ్రెస్ పర్టీ సీనియర్ నాయకులు శేషంక్ రెడ్డి, గ్రామ అధ్యక్షులు కోడూరి పండు, కాంగ్రెస్ పార్టీ నాయకులు అచ్చన రమేష్ తదితరులు పాల్గొన్నారు....

# కాసులు కొట్టు.. నల్ల కనెక్షన్ పట్టు

**మేడ్చల్ మున్సిపల్ పరిధిలో జోరుగా నల్ల కనెక్షన్ల దందా**

**బాలాజీ నగర్‌లో ఒక ఇంటికి నాలుగు నల్ల కనెక్షన్లు**

**రూ. 2 వేలు.. క్వాటర్ మందు ఇస్తే నల్ల కనెక్షన్ వచ్చినట్లే**

మేడ్చల్, ఆగస్టు 4( మనం జిల్లా ప్రతినిధి): మేడ్చల్ మున్సిపల్ పరిధిలో నల్ల కనెక్షన్ కావాలంటే రూ. 2 వేలు, క్వాటర్ మందు బాటిల్ ఇస్తే చాలు నల్ల కనెక్షన్ వచ్చినట్లే. కాసులు కొట్టు.. నల్ల కనెక్షన్ పట్టు అన్న చందనంగా మేడ్చల్ మున్సిపల్ పరిధిలో ఉంది. ఒక్కొక్క ఇంటికి అధికారికంగా ఒక్క నల్ల కనెక్షన్ తో పాటు అనధికారికంగా మూడు నల్ల కనెక్షన్లు ఉన్నాయి. అనుమతులు లేని భవనాలకు సైతం నల్ల కనెక్షన్లు మంజూరు అవుతున్నాయి అంటే పరిస్థితి ఏ విధంగా ఉందో ఇట్టే అర్థమవుతుంది. అక్రమ నల్ల కనెక్షన్ల దందాను కమిషనర్ వరకు వెళ్లనివ్వకుండా జాగ్రత్త పడుతూ కొందరు మున్సిపల్ సిబ్బంది చక్రం తిప్పుతూ అక్రమ నల్ల కనెక్షన్ల దందాను కొనసాగిస్తున్నారు. మేడ్చల్ మున్సిపల్ పరిధిలో అధికారికంగా7, 595 అధికారికంగా నల్ల కనెక్షన్లు ఉండగా అనధికారికంగా మరెన్నో ఉన్నాయి. దీనివల్ల మేడ్చల్ మున్సిపల్ కార్యాలయానికి భారీ ఎత్తున ఆర్థికంగా గండి పడుతుంది.

**నల్ల కనెక్షన్లు కావాలంటే డిడి కట్టాలి**

నల్ల కనెక్షన్లు కావాలంటే ముందుగా మున్సిపాలిటీకి డిడి చెల్లించాల్సి ఉంటుంది. వాణిజ్య సముదాయాలకు నల్ల కనెక్షన్లు రూ. 26 వేలు, డొమెస్టిక్ నల్ల కనెక్షన్ కు రూ. 8800 డిడి చెల్లించాల్సి ఉంటుంది. ఈ డి డి ని మున్సిపల్ ఉన్నత అధికారులకు సమర్పించిన అనంతరం వారు ఓకే అన్నాకే నల్ల కనెక్షన్ ఇవ్వాల్సి ఉంటుంది. అయితే మేడ్చల్ మున్సిపల్ పరిధిలో మాత్రం ఎలాంటి డీడీలు




కట్టించుకోకుండానే నేరుగా నీటి నల్ల కనెక్షన్లు ఇస్తున్నారనే ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. మున్సిపల్ సిబ్బంది కొందరు మామూళ్లకు అలవాటు పడి చేతివాటం ప్రదర్శిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని బాలాజీ నగర్, ఉమా నగర్, కేవిఆర్ ఫేస్ వన్, టీచర్స్ కాలనీలో అక్రమ నల్ల కనెక్షన్లు ఎక్కువ ఉన్నట్లు తెలుస్తోంది. కే ఎల్ ఆర్ వెంచర్ లోని శ్రీ కాలనీలో దాదాపు 90 శాతం అక్రమ కనెక్షన్లు ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అడిగినంత డబ్బులు ఇచ్చి, క్వాటర్ మందు ఇస్తే చాలు నల్ల కనెక్షన్ వచ్చినట్లే. అది కమర్షియలా, డొమెస్టిక్ కా అని చూడకుండా ఎడాపెడా అక్రమ నల్ల కనెక్షన్లు ఇచ్చేస్తున్నారు.

**అనుమతులు లేని భవనాలకు నల్ల కనెక్షన్**

మేడ్చల్ పట్టణం రోజు రోజుకు విస్తరిస్తుంది. ఎన్నో నూతన భవనాలు అపార్ట్మెంట్లు, విల్లాల నిర్మాణాలు సాగుతున్నాయి. అయితే ఎలాంటి అనుమతులు లేని కొత్త భవనాల కు సైతం నల్ల కనెక్షన్లు ఇస్తూ అందిన కాడికి దోచుకుంటున్నారు. నిబంధనల ప్రకారం మున్సిపల్ నుండి అనుమతులు పొందిన భవనాలకే నల్ల కనెక్షన్



ఇవ్వాల్సి ఉంటుంది. అయితే మేడ్చల్ మున్సిపల్ పరిధిలో మాత్రం వాటర్ డిపార్ట్మెంట్ లో పనిచేసే వారికి ఎలాంటి నిబంధనలు అవసరం లేదు. చేతిలో డబ్బులు పెడితే చాలు ఆ భవనాలకు అనుమతులు ఉన్నాయా? లేవా? చూడకుండానే నల్ల కనెక్షన్ లు ఇచ్చేస్తున్నారని విమర్శలు ఉన్నాయి.

**నూతన కమిషనర్ అక్రమ నల్ల కనెక్షన్లపై దృష్టి సారించాలి**

ఇటీవల మేడ్చల్ మున్సిపల్ కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించిన చంద్రప్రకాష్ రెడ్డి అక్రమ నల్ల కనెక్షన్లపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. ఒక్కొక్క ఇంటికి మూడు నాలుగు నల్ల కనెక్షన్లు ఉన్నాయని, అందులో ఒకటి అధికారికంగా ఉండగా, మరో మూడు అధికారికంగా కొనసాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా బాలాజీ నగర్ లో అక్రమ నల్ల కనెక్షన్లు ఉన్నాయని, వాటిపై ప్రత్యేక దృష్టి సారించి కఠిన చర్యలు తీసుకోవాలని నగరవాసులు డిమాండ్ చేస్తున్నారు.



## అంగన్వాడి కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు

ఇబ్రహీంపట్నం ఆగస్టు 4 మనం న్యూస్: రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని అంగన్వాడి సెంటర్ 4 లో సోమవారం తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలకు సామూహిక మంత్రములు జరిపారు. ఈ సమావేశాల్లో టిడిపిఒ వినితా దేవి మాట్లాడుతూ... తల్లిపాల ప్రాధాన్యతను తెలియజేశారు. ప్రభుత్వం పేద మహిళల ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకుంటుందన్నారు. తల్లులు బిడ్డ పుట్టిన వెంటనే అపోహలను వీడి తల్లిపాలు తాగించాలని కోరారు. తల్లిపాల వలన బిడ్డ ఆయుష్షును పెంచిన వారవుతారని పేర్కొన్నారు. ముర్రుపాలెం బిడ్డ రోగ నిరోధక శక్తిని గ పెంచుతుందన్నారు. డబ్బా పాలు వద్దు... తల్లిపాలే ముద్దని తెలియజేశారు.

అంగన్వాడీల ద్వారా ప్రభుత్వం అందించే పోస్ట్ కి ఆహారాన్ని తీసుకోవాలని కోరారు. గర్భిణీలు ప్రసవ సమయంలో సిజేరియన్ లా వైపు వెళ్లకుండా సాధారణ కానుక చేయించుకుంటే మంచిదని సూచించారు. ఆయా గ్రామాల్లోని చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ పల్లవి, అంగన్వాడీ టీచర్స్ విజయలక్ష్మి, బాలమణి తదితరులు పాల్గొన్నారు

## మేడ్చల్ జిల్లాలో కుండపోత వర్షం

**రోడ్లపై నిలిచిన వరద నీరు**

**పంపించిన ట్రాఫిక్**

మేడ్చల్, ఆగస్టు 4( మనం జిల్లా ప్రతినిధి ): మేడ్చల్ జిల్లాలో కుండపోత వర్షం కురిసింది. దీంతో రోడ్లపై భారీ ఎత్తున వరద మీరు నిలిచిపోయింది. సూరారం, మైసమ్మగూడ, మేడ్చల్, షామీర్పేట్, తూముకుంట పరిసర ప్రాంతాలలో రోడ్లపై మోకాళ్ళ లోతు వరద నీరు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు, జిల్లాలోని పలుచోట్ల ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. ముఖ్యంగా గుండ్ల పోచంపల్లి మున్సిపల్ పరిధిలోని మైసమ్మగూడలో రోడ్లపై వరద నీరు భారీ ఎత్తున నిలిచిపోయింది. ఇంజనీరింగ్ కళాశాలలు వదిలే సమయానికి భారీ ఎత్తున వర్షం కొరిసి రోడ్లపై వరద నీరు నిలిచిపోవడంతో భారీ ఎత్తున ట్రాఫిక్ జామ్ అయింది. విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పలుచోట్ల రోడ్లపై నిలిచిన వరద నీటిలో ద్విచక్ర వాహనాలు, కార్లు సగం వరకు మునిగిపోయాయి. అపార్ట్మెంట్లలో సెల్లార్ లోకి వరద నీరు చేరడంతో అపార్ట్మెంట్ వాసులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ఇటీవల రెండు మూడు రోజులపాటు వర్షాలు కురిసి ఆగిపోయి ఎండలు కొట్టడంతో ఉడుకపోతతో సతమతమైన ప్రజలు దాదాపు రెండు గంటల పాటు కురిసిన కుండ పోత వర్షంతో వాతావరణం చల్లబడడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.



## అంటు వ్యాధులు రాకుండా చర్యలు తీసుకోండి

**ఎల్లంపేట మున్సిపల్ కమిషనర్ కు వినతి**



మేడ్చల్, ఆగస్ట్ 4( మనం జిల్లా ప్రతినిధి ): మేడ్చల్ జిల్లా ఎల్లంపేట మున్సిపల్ పరిధిలోని రావల్ కోల్ గ్రామంలో దోమల మందు కొట్టలని ఎల్లంపేట్ మున్సిపల్ కమిషనర్ కు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో వినతిపత్రం వేశారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ మేడ్చల్ మండల కార్యదర్శి ఎం. నరేష్ మాట్లాడుతూ ఎల్లంపేట్ మున్సిపాలిటీ ఏర్పడినప్పటి నుండి ఇప్పటివరకు దోమల మందు కొట్టకపోవడం వలన అనేక విష జ్వరాలు వచ్చే అవకాశం ఉందన్నారు, అంతేకాకుండా జోరుగా వర్షాలు కురుస్తుండడం వల్ల చిన్నపిల్లలకు, పెద్దలకు అంటూ వ్యాధులు మలేరియా, డెంగ్యూ లాంటి చాలా తీవ్రమైన ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని వెంటనే రావల్ కోల్ గ్రామంలో దోమల మందును కొట్టాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రావల్ కోల్ జెడ్ పి హెచ్ ఎస్ హైస్కూల్ నుండి కొత్త గ్రామ పంచాయతీ బిల్డింగ్ వరకు ఉన్న పెద్ద మోరిని క్లీన్ చేయకపోవడం వలన దోమలు ఎక్కువగా వ్యాప్తి చెందుతున్నాయని, ఇండ్లకు ఎక్కువ దోమలు రావడం ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారని తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి పెద్దమోరిని వెంటనే క్లీన్ చేయాలని, బ్లీచింగ్ పౌడర్ కొట్టాల్సిందిగా, గ్రామంలో చెత్త ఎక్కడ పేరుకుపోయిన అక్కడ బ్లీచింగ్ పౌడర్ కొట్టి దోమల సమస్యను పరిష్కరించి అంటూ వ్యాధుల నుండి ప్రజలను కాపాడాలని కోరారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ నిత్యానంద్ స్పందించి బ్లీచింగ్ పౌడర్ కొట్టిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ గ్రామ కార్యదర్శి ఎ. కొమురయ్య, నాయకులు హకీమ్, మాణితేజ పూజ తదితరులు పాల్గొన్నారు



## విగ్రహ ఆవిష్కరణ వేడుకల్లో ఎమ్మెల్యే

కడ్తాల్, ఆగస్టు 4 ( మనం, న్యూస్ ) : కడ్తాల్ మండలం ఎక్వాయిపల్లి గ్రామంలో సోమవారం శ్రీ రేణుకా ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే వెంట మార్కెట్ చైర్ పర్సన్ యాట గీత నర్సింహా, వైస్ చైర్మన్ భాస్కర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, సింగల్ విండో డైరెక్టర్ చేగూరి వెంకటేష్, స్థానికులు పాల్గొన్నారు.

# ఆకస్మిత తనిఖీ..జిల్లా కలెక్టర్ మను చౌదరి

ఘట్కేసర్ మనం న్యూస్ ఆగస్టు 04: ఘట్కేసర్ ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మిత తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ మను చౌదరి. సోమవారం ఘట్కేసర్ మున్సిపల్ లోని ఏరియా ఆసుపత్రిని జిల్లా కలెక్టరు ఆకస్మికంగా తనిఖీ చేసారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎఎన్ సి ఎన్ని కేసులు విస్ అవుతున్నాయని, పరీక్షలకు రానివారిని ఏవిధంగా గుర్తిస్తున్నారని గైనకాలజిస్టు డాక్టరును అడిగి తెలుసుకున్నారు. ఎ ఎన్ సి పరీక్షలకు రాని వారిని గుర్తించి ఆశావర్కర్లు, ఎఎంసిల ద్వారా వారికి కౌన్సిలింగ్ ఇప్పించాలని కలెక్టరు తెలిపారు. ప్రతి నెల ఎన్ని కేసులు సి సెక్షన్ అవుతున్నాయని, సి సెక్షన్ వరకు వెళ్లకుండా ముందు జాగ్రత్తలు తీసుకునేలా పేషంట్లకు జాగ్రత్తలు, సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. ఇన్ పేషంట్లు గా ఉన్న చిన్నారులతో ఏమైంది ఇప్పుడు ఎలా ఉంది, ఎం చదువుతున్నారు , జ్వరం తగ్గిపోతుంది అని కలెక్టరు మాట్లాడారు. ఎస్సెన్షియల్ మెడిసిన్ ఇన్డెంట్ ను పరిశీలించి, మందులు ఎలా తెప్పిస్తున్నారని అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ల్యాబరేటరీని పరిశీలించి రోజుకు ఎన్ని పరీక్షలు చేస్తున్నారని,ఇక్కడ ఎన్ని పరీక్షలు అందుబాటులో ఉన్నాయని, ఇక్కడ లేని పరీక్షలు ఎక్కడ



చేయిస్తున్నారని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఎక్స్ రే విభాగాన్ని పరిశీలించి డిజిటల్ ఎక్స్ రే ఉందా అని అడిగి తెలుసుకున్నారు. ఫోటోగ్రఫి మిషిన్స్ ను పరిశీలించి 5 మిషిన్లు సరిపోతున్నాయా అని కలెక్టరు అడుగగా, సరిపోతున్నాయని మెడికల్ ఆఫీసర్ సమాధానమిచ్చారు. ఓపి పేషంట్ల నమోదు రిజిస్ట్రేషన్ హిస్టరీ అప్ డేట్ అవుతుందా అని కలెక్టర్ ఆరా తీసారు. కలెక్టర్ ఆసుపత్రి మొత్తం తిరిగి పరిశీలించి, అవసరమైన వైద్య పరికరాలకు, మరమ్మత్తులకు ఎస్టిమేషన్స్ వేసి తనకు పంపాలని కలెక్టర్ మెడికల్ ఆఫీసర్ కు సూచించారు. రోగులకు అందిస్తున్న సేవలు, సిబ్బంది హాజరు పట్టిక ఓపి రిజిస్టర్, డెలివరీ రిజిస్టర్, పరిశీలించి వైద్య సిబ్బందికి తగు సూచనలు చేశారు. పేద ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం వైద్య శాఖను బలోపేతం చేస్తూ పటిష్ట కార్యాచరణ ద్వారా ముందుకు పోతుందని దానికి అనుగుణంగా వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. సీజనల్ వ్యాధులను దృష్టిలో పెట్టుకొని వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తంగా ఉందని, జిల్లాలోని ఆరోగ్య కేంద్రాలను పటిష్టంగా పర్యవేక్షిస్తున్నా మన్నారు. వైద్య సిబ్బంది సమయపాలన, మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఆదర్శంగా నిలుస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఘట్కేసర్ ఎమ్మార్వో రజని, మెడికల్ ఆఫీసర్, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు....

# హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

**కడ్తాల్ తహశీల్దార్ కార్యాలయం ఎదుట బీజేపీ ధర్నా**

**ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి**

**పాల్గొన్న జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి, మాజీ ఎంపీ రాములు**



కడ్తాల్, ఆగస్టు 4 ( మనం, న్యూస్ ) : రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలం చెందని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, మాజీ ఎంపీ రాములు అన్నారు. సోమవారం రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండల కేంద్రంలో బీజేపీ పార్టీ మండల అధ్యక్షుడు దొనదుల మహేష్ ఆధ్వర్యంలో ర్యాలీ, ధర్నా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా తల్లోజు ఆచారి, పోతుగంటి రాములు హాజరయ్యారు. కడ్తాల్ పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించి తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచారి, రాములు మాట్లాడారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు మరియు అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ఎన్నో అనేక హామీలను ఇచ్చిన తర్వాత వాటిలో భాగంగానే రాష్ట్ర బడుగు బలహీన వర్గాల ప్రజలకు మరియు దివ్యాంగులకు పెన్షన్లను పెంచుతామని ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పడం జరిగింది. వితంతువులకు వృద్ధులకు మరియు ఒంటరి మహిళలకు 2వేల నుండి 4వేలకు పెంచుతామని, అదేవిధంగా దివ్యాంగులకు 4వేల నుండి 6వేలకు పెంచుతామని, మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు 2500, ఆడపిల్లల పెళ్లిలకు తులం బంగారం, రైతు భరోసా ఎకరానికి 15000, ప్రతి రైతుకు రెండు లక్షల రుణమాఫీ, తెలంగాణ ఉద్యమకారులకు 25000 పెన్షన్ ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని అనేక హామీలు చెప్పి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి 20 నెలలు గడుస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్ దారులకు తక్షణమే పెన్షన్ పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ ముంతాజ్ బేగం కు వినతి పత్రం సమర్పించారు. ఈ ధర్నాలో మాజీ జెడ్పిసి హరి ప్రసాద్, మండల పార్టీ మాజీ అధ్యక్షులు మాన్యా నాయక్, రాష్ట్ర నాయకులు సాయిలాల్ నాయక్, భగీరత్, శంకర్ నాయక్, జిల్లా నాయకులు శ్రీశైలం గౌడ్, యాదగిరి, మండలం నాయకులు వెంకటేష్ యాదవ్, విక్రం, పొగాకు వెంకటేష్, రాములు, జంగం వెంకటేష్, మాజీ సర్పంచ్ సాయిలు, సాయిగౌడ్, నరేష్ గౌడ్, ప్రేమ్ నాయక్, పవన్ రెడ్డి, సందీప్ నాయక్ పాల్గొన్నారు.

# మేడ్చల్‌లో పేలిన గ్యాస్ సిలిండర్



**కూలిన భవనం**

**ఐదుగురికి తీవ్ర గాయాలు**

మేడ్చల్, ఆగస్టు 4 ( మనం జిల్లా ప్రతినిధి) మేడ్చల్ పట్టణం రాత్రి 10 గంటల ప్రాంతంలో సిలిండర్ పేలిన ఘటన కలకలం సృష్టించింది. మేడ్చల్ పట్టణంలోని పూల నారాయణ భవనం వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. ఒకేసారి పెద్ద శబ్దంతో సిలిండర్ పేలడంతో ఇంటి పైకప్పు కూలిపోయింది. ఈ ఘటనలో ఐదుగురు భవనంలో చిక్కుకొని తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు, పోలీసులు సహాయక చర్యలో పాల్గొన్నారు. గాయపడ్డ వారిని వెంటనే స్థానిక ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనలో రెండు పూల దుకాణాలు, ఒక మొబైల్ షాపు పూర్తిగా ధ్వంసమయ్యాయి.



# 3 అక్రమ కట్టడాలు సీజ్

**తూంకుంట మున్సిపల్ పరిధిలో అక్రమ కట్టడాలపై కొరడా**



మేడ్చల్, ఆగస్టు 4( మనం జిల్లా ప్రతినిధి): మేడ్చల్ జిల్లా తూముకుంట పురపాలక సంఘ పరిధిలోని మూడు అక్రమ కట్టడాలను మున్సిపల్ కమిషనర్ ఎం. ఎన్. ఆర్ జ్యోతి సీజ్ చేశారు. గతంలో ఇట్టి అక్రమ కట్టడాలకు నోటీసులు జారీ చేసినా కూడా పనులు నిలుపుదల చేయకుండా పనులు కొనసాగిస్తున్నందున తూంకుంట మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ అధికారి శ్రీధర్ నేతృత్వంలో సంబంధిత వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, టౌన్ ప్లానింగ్ సిబ్బందితో కలిసి అక్రమ కట్టడాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ జ్యోతి మాట్లాడుతూ పట్టణ ప్రజలు తాము చేపట్టే నిర్మాణాలకు విస్తీర్ణం బట్టి బిల్ నౌ లో కానీ హెచ్ఎండిఏ లో కానీ దరఖాస్తు చేసుకోవాలని అనుమతి పొందిన విధముగా నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడైనా అక్రమ నిర్మాణాలు చేపట్టినా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# అమ్ముగూడ, యాప్రాల్ స్మశాన వాటికల అభివృద్ధి..

**మేడ్చల్ మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల సహకారంతో..**

జవహర్ నగర్ / యాప్రాల్, ఆగస్టు 4 (మనం న్యూస్): మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అమ్ముగూడ, యాప్రాల్ స్మశాన వాటికల అభివృద్ధి నిధుల ఫైలు పెండింగ్లో ఉండడంతో పనులు జరగడం లేదని పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని ఎంపీ ఈటెల రాజేందర్ ను కోరగా..



వెంటనే స్పందించి అధికారులకు సమాచారం ఇచ్చి నిధులు మంజూరు చేయించడం జరిగిందని, అమ్ముగూడ గ్రేవ్యార్డ్ , యాప్రాల్ గ్రేవ్యార్డ్ హిందూ గ్రేవార్డ్ అధ్యక్షులు సంగోధి పరమేష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్మశాన వాటికల కు నిధులు రాకపోవడంతో పనులు నిలిచిపోయాయని ఈటల రాజేందర్ ను కోరడంతో వెంటనే జిఎంహెచ్ఎస్సి కమిషనర్ ఆర్వి కర్ణన్ , జోనల్ కమిషనర్ (నార్త్ జోన్) ఎన్, రవి కిరణ్లను కలవాలని వారికి సిఫారస్ చేయడం జరిగిందన్నారు. ఇందిరానగర్ కాలనీలో షెడ్తో కూడిన కొత్త జి ప్లస్ 1 కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం కొత్త ప్రతిపాదనను సమర్పించాలని సూచించడం జరిగింది అన్నారు. అధికారులను కలిసి మాట్లాడగా పనులను త్వరగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ సమావేశంలోఎస్. మహేష్ కుమార్ పూజారి, పి. శివ కుమార్. వెంకట్ జైసింహ. విశాల్ భీమ్, శ్రీనివాసన్, సుందర్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.